నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ
1
శుక్రవారం | జనవరి 10, 2025 | www.navatelangana.com

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు :తహసీల్దార్

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్



ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే వారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ హరిబాబు హెచ్చరించారు.. గురువారం మండలంలోని ఆలగడప గ్రామంలో సర్వే నెం.833లో గల 1.30 ఎకరం ప్రభుత్వ భూమిని గుర్తించి హద్దులు నిర్ణయించి ప్రభుత్వ భూమిగా బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమించినా, నిర్మాణాలు చేపట్టినా చట్టరిత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

రేషన్‌షాపు ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీచేయాలి

నవతెలంగాణ-క్లాక్‌టవర్



రేషన్ షాప్ లో 14 రకాల సరుకులను అందజేయాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొండ అనురాధ డిమాండ్ చేశారు.గురువారం నల్లగొండ మండలంలోని ముషంపల్లి గ్రామంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని హామినిచ్చి ఇంతవరకు అమలు చేయలేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడం వల్ల మహిళలు చాలా ఇబ్బంది పడుతూ సరైన ఆహారం తినలేక పౌష్టికాహార లోపంతో రక్తహీనతకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో షాహిదా ,విమలమ్మ ,శ్యామల ,సుల్తానా, హైమావతి, రజియా ,నసీమా, సత్యవతి ,హసీనా, లక్ష్మీ ,పాపమ్మ ,గౌస్య బేగం ,మౌనిక కళ్యాణి ,మణమ్మ ,తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ సంక్షేమ చట్టాలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

నవతెలంగాణ-నాగార్జునసాగర్



గతంలో ఎన్నో సంక్షేమ చట్టాలను ఆదివాసీల సంక్షేమం కోసం కాంగ్రెస్ తీసుకువచ్చిందని ఆ చట్టాలను బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ ప్రాజెక్టు హౌజ్ లో జరుగుతున్న అఖిలభారత గిరిజన ఆదివాసి కాంగ్రెస్ ప్రతినిధుల శిక్షణా తరగతులకు గురువారం హాజరయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో తొందరలోనే లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహిస్తామని, స్థానిక ప్రజా ప్రతినిధులు ఉంటే ఎక్కువ అభివృద్ధి జరిగే అవకాశం ఉంటుందన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు..గ్రామాల అభివృద్ధి జరగాలంటే స్థానిక ప్రజాప్రతినిధుల పాత్ర ముఖ్యమైనదన్నారు. సంక్షేమాలకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు . బీఆర్ఎస్ అబద్ధాల పునాదులపై అధికారం చలాయించారని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం సంక్షేమానికి బదులు మనుధర్మం పేరుతో మతం పేరుతో ప్రజల మధ్యన గిరిజనులు, ఆదివాసుల మధ్యన విభేదాలు తీసుకువచ్చి అక్కడ ఉన్న సంపదను దోచుకోవడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. మణిపూర్, ఛత్తీస్‌ఘడ్ లలో స్థానికంగా ఉండే ప్రజలకు గ్రామా సభల ద్వారా ఉన్న హక్కులను పక్కనపెట్టి మైనింగ్ పేరుతో ఆదాని ,అంబానీలకే కేవలం బీజేపీ ప్రభుత్వం అటవీ భూములను కట్టబెడుతూ సాధారణ ప్రజలకు ఒక్కరికి కూడా పట్టాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. 2006 సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం అటవీ హక్కుల చట్టం తీసుకు వచ్చిందని, ఐటిడిఏ ఒక ప్రత్యేక భౌగోళిక ప్రాంతంలో మా ఊరు మా రాజ్యం పేరుతో చట్టం తీసుకు వచ్చిందని గుర్తు చేశారు. ఆదివాసీల సంపదను కార్పొరేట్ రంగాలకు వశం చేయడానికి కుట్రలు చేస్తుందన్నారు. ఆమె వెంట ట్రైకార్ చైర్మెన్, తదితరులు ఉన్నారు.



డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే స్వాధీన పరచాలి

- 5వ రోజు ప్రజాసంఘాల మద్దతు

నవతెలంగాణ-క్లాక్‌టవర్

నల్గొండ పట్టణంలో ప్రభుత్వం లాటరీ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు వెంటనే స్వాధీన పరచాలని ఆవాజ్ జిల్లా కార్యదర్శి సయ్యద్ హాశం, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ డిమాండ్ చేశారు గురువారం పెదగడియారం సెంటర్లో డబల్ బెడ్ రూమ్ సాధన కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న 5వ రోజు రిలే నిరాహార దీక్షల కు ఆవాజ్, సీఐటీయూ, కేవీపీఎస్, ఐద్వా సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా ఆ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు పెట్టి పేదల కోసం ఇల్లు నిర్మించి లాటరీ ద్వారా ఎంపిక చేసిన స్వాధీనపరచకపోవడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. గత ప్రభుత్వం నిర్మించిన పంపిణీ చేయలేకపోయిందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటిన మౌలిక సదుపాయాలు కల్పించి ఎందుకు స్వాధీన పరచడం లేదు తెలుపాలని ప్రశ్నించారు. ఈ నెల 26 నాటికి పంపిణీ జరగకపోతే ఫిబ్రవరి ఒకటి తర్వాత లబ్ధిదారులతో కలిసి స్వాధీనం చేసుకునే పేదలకు ప్రజా సంఘాలు అండగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల సాధన కమిటీ కన్వీనర్ అవుట.రవీందర్, వివిధ ప్రజా సంఘాల నాయకులు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, పట్టణ నాయకులు అద్దంకి నరసింహ, కోట్ల అశోక్ రెడ్డి, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శులు గాదె నరసింహ, బొల్లు రవీందర్, ఆవాజ్ పట్టణ కార్యదర్శి ఎగ్బాల్ సాజిద్, లబ్ధిదారులు ఎస్కే లతీఫ్ నగీన లక్ష్మీ ఫాతిమా బేగం సుజాత రవీంద్రమ్మ రేణుక సుల్తాన్ యాదమ్మ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ ,మునుగోడు నియోజకవర్గాలను
సస్యశ్యామలం చేస్తాం

- ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి

నవతెలంగాణ-డిండి



ఏదుల నుండి డిండిప్రాజెక్టులోని నీరు తీసుకొచ్చి లక్షా,యాభై వేల ఎకరాలకు నీరందించి దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలను సస్యశ్యామలం చేస్తామని నల్లగొండ పార్లమెంటు సభ్యులు కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. గురువారం డిండి మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులలో ఆయన దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలూనాయక్ తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నల్లగొండ జిల్లాలో సాగునీటి రంగంలో వెనుకబడిన ప్రాంతం దేవరకొండ నియోజకవర్గం అని వచ్చే నాలుగేండ్లలో ఎమ్మెల్యే బాలూనాయక్‌తో కలసిదేవరకొండ నియోజకవర్గం సాగునీటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. డిండి ప్రాజెక్టు సమస్య పరిష్కారమైందని, ఇంకా నాలుగు ఎత్తిపోతల ప్రాజెక్టులను తెచ్చి కోదాడ, సాగర్, హుజూర్‌నగర్, మిర్యాలగూడ కన్నా ఎక్కువగా సాగుచేసేందుకు కృషిచేస్తామన్నారు. ఎమ్మెల్యేనేనావత్ బాలూనాయక్ మాట్లాడుతూ 3.5 కోట్లతో డిండి మండలం కేంద్రంలోని అంగడి బజారులో సెంటర్‌లైట్లతో యుక్తంగా సీసీ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. ఇరిగేషన్ మంత్రి సహకారంతో, ఎంపీ రఘువీర్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృషికి తీసుకవెళ్ళి డిండి ప్రాజెక్టులోని నీరు తీసుకొచ్చామన్నారు. అనంతరం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద కల్యాణలక్ష్మీ, షాదీ ముభారభ్ చెక్కులను పంపిణీ చేశారు. స్త్రీనిధి, మత్యశాఖాల సబ్సీడీతో ఏర్పాటు చేసిన సంచాల చాపల విక్రయ వాహనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మార్కెట్ కమటీ చైర్మెన్ నాయిని జమునమాధవరెడ్డి, నల్లగొండ పార్లమెంటు కోఆర్డినేటర్ యంఏ.సిరాజ్‌ఖాన్, డిండి బ్యాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్‌రావు, మండల అధ్యక్షులు నల్లవెల్లి రాజేష్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ తూం నాగార్జున్‌రెడ్డి, బి.శ్రీనివాస్‌గౌడ్, పోలం లక్ష్మణ్, పోల వెంకటేష్, డిండి మాజీ ఉపసర్పంచ్ నూకం వెంకటేష్, సర్వన్, కొర్ర రవి, గంగిడి ఆనంద్‌రెడ్డి, యాదగిరిరావు, సిపిఐ నాయకులు బొడ్డుపల్లి వెంకటరమణ, తూం బుచ్చిరెడ్డి, బొల్లె శైలేష్, వావిళ్ళ సలయ్య, కొర్ర పాండునాయక్ పాల్గొన్నారు.

పిల్లల పెంపకంలో తల్లిదండ్రులదే గురుతర బాధ్యత



నవతెలంగాణ-మిర్యాలగూడ

పిల్లల పెంపకంలో తల్లిదండ్రలదే గురుతర బాధ్యత అని ప్రముఖ చిన్న పిల్లల సైకాలజిస్ట్ వర్ధని కొణిదెన అన్నారు.గురువారం పట్టణంలోని కృష్ణకాలనీలో గల సేజ్ గీతాంజలి ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో జేఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఆమె అవగాహన కల్పించి మాట్లాడారు. పిల్లలు అన్నిరంగాల్లో రాణించడంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో ఉందన్నారు. ఒత్తిడిని జయించి పరీక్షలు మంచిగా రాసేలా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాధారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుక నవతెలంగాణ

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నవతెలంగాణ-నార్కట్‌పల్లి

నవతెలంగాణ దినపత్రిక సంచలన వార్తల కోసం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నించే గొంతుక అని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అభివర్ణించారు. గురువారం మండల కేంద్రంలో నవ తెలంగాణ 2025 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ తెలంగాణ దినపత్రికలో వచ్చే ప్రతి అక్షరం ప్రజల పక్షంగా నిలుస్తుందని చెప్పారు. ఉద్యోగుల రైతుల కర్షకుల బడుగు బలహీన వర్గాల పక్షాన నిలిచే పత్రిక అని చెప్పారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ నిత్యం ప్రజా సమస్యలను వెలికి తీసే నైజం కలిగిన దినపత్రిక నవ తెలంగాణ అని పేర్కొన్నారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణలో నవ తెలంగాణ రిపోర్టర్ ఎండి నుస్రత్ అలి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బత్తుల ఊశయ్య,చిట్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ ఐత రాజు యాదయ్య, దూదిమెట్ల సత్తయ్య, జేరిపోతుల భరత్, పాశం శ్రీనివాస్ రెడ్డి, దూదిమెట్ల స్రవంతి, ఎండి సర్వర్ అలి, సోమ నరేందర్ రెడ్డి, ప్రజ్ఞాపురం సతీష్ గడ్డం పశుపతి, కొరివి శివుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అభిప్రాయానికి క్యూఆర్ కోడ్



- ఎస్పీ శరత్ చంద్ర పవార్

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

జిల్లాలో పోలీస్ లు అందిస్తున్న సేవలపైన ప్రజల అభిప్రాయం తెలుపుట జిల్లా పోలీసు కార్యాలయంలో సిటిజెన్ ఫీడ్ బ్యాక్ తెలపడానికి ఏర్పాటుచేసిన కుహ్యు ఆర్ కోడ్ కలిగిన పోస్టర్ ను జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లో పిర్యాదు తీసుకొనుట, ఎఫ్ఐఆర్ నమోదు చేయుట, ఈ చాలన్ (ట్రాఫిక్ ఉల్లంఘన) పాస్ పోర్ట్ ధృవీకరణ, , ఇతర అంశాల పైన అభిప్రాయాన్ని ఇక నుంచి క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలన్నారు. జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ లో క్యూఆర్ కోడ్ తో కలిగిన పోస్టర్ అందుబాటులో ఉంటాయన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నవతెలంగాణ-మిర్యాలగూడ

ప్రతి ఒక్కరు విధిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని ఎంవీఐ వీరస్వామి అన్నారు. గురువారం స్థానిక ఆర్‌టీఏ కార్యాలయం వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనల ప్రకారం వాహనాలను నడపాలని, నిబంధనలను అతిక్రమించినట్లయితే లైసెన్స్ రద్దు చేసి కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌టీఏ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల పండగ పూట పస్తులతో ఉంచొద్దు

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సిహెచ్ లక్ష్మీనారాయణ

నవతెలంగాణ-క్లాక్‌టవర్



గ్రామపంచాయతీ కార్మికులను సంక్రాంతి పండగ పూట పస్తులతో ఉంచకుండా 5 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని,మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందర ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సిహెచ్.లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరుతూ జిల్లా పంచాయతీ కార్యాలయ ఏవో ఎస్ కృష్ణ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామపంచాయతీలలో పారిశుధ్యం మంచినీటి సరఫరా వీధిలైట్ల నిర్వహణ పన్నుల వసులు తదితర పనులు నిర్వహిస్తు ప్రజలకు అనేక సేవలు అందిస్తున్న గ్రామపంచాయతీకార్మికుల పట్ల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని ,ఉద్యోగ భద్రతకు ముప్పుగా ఉన్న మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని,కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పోలే సాంబయ్య, జిల్లా నాయకులు, పోలే సత్యనారాయణ, ఇరిగి ఎల్లేష్,కాసర్ల స్వప్న, కొండేటి నరసింహ, జి .వెంకటయ్య, కె .ధనంజయ్ పాల్గొన్నారు.

మహిళా విద్యకు ప్రాధాన్యత కల్పించిన ఫాతిమా షేక్



నవతెలంగాణ-క్లాక్‌టవర్

మహిళలకు విద్య ద్వారానే సమాజం అభివృద్ధి పదంలో నడుస్తుందని నమ్మి మహిళా విద్యాభివృద్ధికి కృషి చేసిన మహనీయురాలు అమ్మ ఫాతిమా షేక్ అని ఆవాజ్ జిల్లా కార్యదర్శి సయ్యద్ హాశం అన్నారు. గురువారం ఫాతిమా షేక్ జయంతి సందర్భంగా క్లాక్‌టవర్ సెంటర్లో ఆమె చిత్రపటానికి ఆవాజ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మా ఫాతిమా షేక్ తన సోదరుడు మియాన్ ఉస్మాన్ షేక్ తో కలిసి పూణే లోని భిదేవాడి ప్రాంతంలో నివసించారు. మహాత్మా జోతిబా పూలే పోరాడుతున్న కులతత్వం , మనువాద ముష్కర విధానాల పై వ్యతిరేక చర్యల కారణంగా మహాత్మ జ్యోతిబా పూలే తండ్రి, అతనిని అమ్మా సావిత్రి బాయి పూలేలను తన ఇంటి నుండి బహిష్కరించినప్పుడు, అమ్మా ఫాతిమా బేగంషేక్ వారికి తన ఇంట్లో ఆశ్రయమిచ్చారన్నారు. అప్పుడు వారు తమ లక్ష్య సాధనకు ఫాతిమా షేక్ ఇంట్లోనే మహిళల కోసం మొట్టమొదటి పాఠశాలను ప్రారంభించారని తెలిపారు. ఫాతిమా షేక్ మొదటి మహిళా మొదటి మైనారిటీ ఉపాధ్యాయురాలిగా, సంఘ సంస్కర్తగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ నల్గొండ పట్టణ కార్యదర్శి ఎగ్బాల్ సాజిద్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సలీం , ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, ఆవాజ్ సభ్యులు నగీన ,ఫాతిమా బేగం ,గౌసియా, వహీదాబీ, పర్వీన్, ఎస్ కే బి బి, లతీఫ్, సుల్తాన్ ,రిజ్వాన్, లక్ష్మి రవీంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ రూరల్ : దేశంలో మహిళా విద్య కోసం కృషి చేసిన మొదటి తరానికి చెందిన వారిలో ఫాతిమాషేక్ ఒకరని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. గురువారం ఫాతిమాషేక్ 194వ జయంతి సందర్భంగా పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రేపాల శ్రీనివాస్ మాట్లాడుతూ తన సోదరుని సహాయంతో ఫాతిమా విద్యను అభ్యసించి అణగారిన వర్గాల విద్య కోసం విశేష కృషి చేశారన్నారు. అదేవిధంగా జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ వివక్షకు, అన్యాయానికి, అణచివేతకు గురైన అన్ని వర్గాల కోసం ఫాతిమాషేక్ పాటుపడ్డారని అన్నారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, దొనేటి శేఖర్, సతీష్ కట్టా అరుణ, సత్యనారాయణరెడ్డి, సంధ్యరాణి, మాధవి, జ్యోత్స్న, జడ శ్రీనివాస్, శ్రీదేవి, ప్రవంతి, కీర్తి, సంజన, అనిత, గాయత్రి, విజ్ఞత, రేణుక, వెన్నెల, అఖిల, నరేష్, వెంకన్న పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్టును తనిఖీ చేసిన ఎస్‌పిఎఫ్ డైరెక్టర్ జనరల్

నవతెలంగాణ-నాగార్జునసాగర్



నాగార్జునసాగర్ ప్రాజెక్టును ను గురువారం తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ అనిల్ కుమార్ సందర్శించి తనిఖీ చేశారు. ముందుగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు లెఫ్ట్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్ వద్దకు చేరుకోగా అక్కడ ఎస్పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ బ్రహ్మచారి, అసిస్టెంట్ కమాండెంట్ కోటేశ్వరరావు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్ ను చేరుకొని అక్కడ ఎస్ పి ఎఫ్ బలగాల విధి నిర్వహణ విభాగాలను పరిశీలించారు. అనంతరం నాగార్జునసాగర్ ప్రధాని డ్యాం పైకి చేరుకోగా నలగొండ అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజులు పూల మొక్కలతో స్వాగతం పలికారు. నాగార్జునసాగర్ ప్రధాన డ్యాము ప్రారంభం నుండి చివరి వరకు నడుచుకుంటూ ఎస్పీఎఫ్ విధి నిర్వహణ పాయింట్లు తనిఖీ చేస్తూ పరిశీలించారు. డ్యామ్ అంతర్భాగంలోని 420 గ్యాలరీలకు చేరుకొని పరిశీలించారు. డ్యామ్ అంతర్భాగంలోని గ్యాలరీల ద్వారా ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎడమ కాలువ, లెఫ్ట్ ఎర్త్ డ్యాం, ప్రధాన డ్యాం పరిధిలోని ఎస్‌పిఎఫ్ విధి నిర్వహణ పాయింట్లు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎస్‌పిఎఫ్ విధి నిర్వహణ పాయింట్లు తనిఖీపై వచ్చినట్లు తెలిపారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు భద్రత విధి నిర్వహణ పై ఉన్నత స్థాయి సమీక్ష ఉన్నందున సాగర్ ప్రాజెక్టు పై అవగాహనక కోసం వచ్చినట్లు తెలుస్తుంది. వీరికి నాగార్జునసాగర్ ప్రాజెక్టు వివరాలను, చారిత్రక విశేషాలను స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ వివరించారు. వీరితోపాటు సాగర్ సిఐ బీసన్న, ఎస్‌పిఎఫ్ ఆర్ఐ లు శ్రీనివాసరావు, ప్రతాప్ నాయుడు, సాగర్ డ్యాం ఏఈలు కృష్ణయ్య సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

కొంపెల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం

నవతెలంగాణ-మునుగోడు



ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో జిల్లాలోనే కొంపెల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చుదిద్దుతామని కాంగ్రెస్ నాయకులు వెదిరె జితేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జాల వెంకన్నయాదవ్ అన్నారు. మండలంలోని కొంపెల్లి గ్రామంలో వీధిలైట్ లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వెదిరె మెగా రెడ్డి, వెదిరె విజేందర్ రెడ్డి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి 140 ఎల్ఈడి స్ట్రీట్ లైట్లు మంజూరు చేశారు. గురువారం గ్రామంలోని కాంగ్రెస్ నాయకులతో కలిసి వారు లైట్లను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీధిలైట్లు ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దాం యాదయ్య, మక్కెన అప్పారావు, పిఏసిఎస్ డైరెక్టర్ మాదరగొని యాదయ్య, మాజీ సర్పంచ్ బోయపర్తి లింగయ్య, యువజన కాంగ్రెస్ నియోజవర్గ ఉపాధ్యక్షులు బోయపర్తి ప్రసాద్, కుమార్, యాదయ్య మనోజు, వెంకన్న, మహేష్, నరసింహ, శ్రీశైలం పాల్గొన్నారు.



ధరణిలో ఎలాంటి సమస్యల్లేకుండా చూడాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నవతెలంగాణ-చండూరు

ధరణిలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తహసీల్దార్లు చూడాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధరణి ఫైళ్లను, ధరణి పోర్టల్ ను పరిశీలించి పెండింగ్లో ఉన్న దరఖాస్తులు, ఇప్పటివరకు ధరణి ద్వారా పరిష్కరించిన సమస్యలు, తదితర వివరాలను పరిశీలించారు. ధరణి ద్వారా వచ్చే దరఖాస్తులన్నింటిని పెండింగ్లో ఉంచకుండా పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. భూ సమస్యల పరిష్కారంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ముఖ్యమైన సమస్యలపై ఆర్డీవో సైతం పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో శ్రీదేవిని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామపంచాయతీల్లో వంద శాతం పన్నులు వసూలు చేయాలి

- జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య

నవతెలంగాణ-మిర్యాలగూడ



గ్రామపంచాయతీ పరిధిలోని ప్రతి ఇంటి యజమానికి డిమాండ్ నోటీసు అందజేసి వంద శాతం పన్నులు ఫిబ్రవరి వరకు వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య కోరారు. గురువారం మిర్యాలగూడ ఎంపీడీవో సమావేశ మందిరంలో అడవిదేవులపల్లి దామరచర్ల మిర్యాలగూడ మండలాల పంచాయితీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో వెంకయ్య మాట్లాడుతూ పన్నులు వసూలు చేసిన మొత్తాన్ని ట్రెజరీలో జమ చేసి ఆన్ లైన్ లో క్రమబద్ధీకరించాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ప్రభుత్వ హాస్టల్లో క్లీనింగ్ గ్రామపంచాయతీ ద్వారా నిర్వహించి వాటికి నీటి వసతి పైపులైను ద్వారా కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవరావు, మిర్యాలగూడ ఎంపీడీవో శేషగిరి శర్మ ,మండల పరిషత్తు అభివృద్ధి అధికారి, మాతంగి రమేష్, మోహిని, శ్రీకాంత్ రెడ్డి మండల పంచాయతీ అధికారులు, మిర్యాలగూడ దామరచర్ల అడవిదేవులపల్లి మండలాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అర్పీలు సమర్థవంతంగా పని చేయాలి

- సబ్ కలెక్టర్ నారాయణ అమిత్

నవతెలంగాణ-మిర్యాలగూడ



ఆర్పీలు సమర్థవంతంగా పనిచేయాలని సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. మున్సిపల్ పట్టణ పేదరిక నిర్మూలన కార్యక్రమం (మెప్మా) రిసోర్స్ పర్సన్లకు సిఎ వి.సత్యనారాయణ అండ్ కంపెనీ సిఎల ఆధ్వర్యంలో గురువారం స్థానిక కళాభారతి మినీ ఆడిటోరియం ఆవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండి.యూసుఫ్, నిర్వాహకులు సత్యనారాయణ, ఆర్పిల రాష్ట్ర అధ్యక్షులు జాజుల చంద్రకళ, ఆర్పీలు సరిత, ఝాన్సి, వినోద, ప్రసన్న, పద్మ, నాగమణి, రాజేశ్వరి,భవాని పాల్గొన్నారు.



లోకల్ ఆటో చార్జీలు పెంచాలని ధర్నా

నవతెలంగాణ-నకిరేకల్

లోకల్ ఆటో చార్జీలు రూ. 15 నుండి రూ.20 లకు పెంచాలని డిమాండ్ చేస్తూ గురువారం నకిరేకల్ పట్టణంలో పాత ఎమ్మార్వో ఆఫీస్ వద్ద అంబేద్కర్ లోకల్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఆటోలు నడపకుండా బంద్ కార్యక్రమం నిర్వహించి అనంతరం ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు వంటేపాక నాగరాజు, బండారి శ్రీను లు మాట్లాడుతూ పెరిగిన చార్జీలకు అనుగుణంగా లోకల్ ఆటో చార్జీలు రూ.15 నుండి రూ.20 పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం నకిరేకల్ కార్మిక శాఖ అధ్యక్షుడు శిగ శ్రీనును కలిసి చార్జీలు పెంచేలా కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు గంధమల్ల సత్తయ్య, ఉపాధ్యక్షులు నర్సింగ్ ఇసాక్, కోశాధికారి గద్దపాటి మోహన్, కార్యదర్శి సీతమోహన్, సలహాదారులు దుబ్బాక వెంకన్న, దాసరి సురేష్, బండమీది ఎల్లయ్య పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-ఆత్మకూరు ఎస్



మండలంలోని ఆత్మకూర్, నిమ్మికల్ గ్రామాలలో ఉన్న ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం మండలంలో సాగు చేస్తున్న వేరుశనగ పంటను పరిశీలించి సస్య రక్షణ చర్యలు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి మాట్లాడుతూ మండలంలో ఎలాంటి ఎరువుల కొరత లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.దివ్య వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్.పవన్ పాల్గొన్నారు.

పెరిక హాస్టల్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కోదాడటౌన్



కోదాడ పెరిక హాస్టల్‌కు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం అభినందనీయమని పెరిక సంఘం రాష్ట్ర నాయకులు జుట్టుకొండ సత్యనారాయణ, అంగిరేకుల నాగార్జునలు అన్నారు. గురువారం హాస్టల్‌కు నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైన హసనాబాద రాజేష్, గౌరవ అధ్యక్షులు పాయిలి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సుందరి వెంకటేశ్వర్లు, కోశాధికారి గుండు అనురాధ, ఉపాధ్యక్షులు ముత్తినేని కోటేశ్వరరావు, దొంగరి సత్యనారాయణ, కందుల చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి కొనకంచి వెంకటేశ్వర్లు, వనం నాగేశ్వరావుతో పాటు కార్యవర్గం బాధ్యతలు తీసుకున్న సందర్భంగా వారిని అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రామినేని శ్రీనివాసరావు, బొలిశెట్టి కృష్ణయ్య, దొంగరి వెంకటేశ్వర్లు, సుంకరి అజయ్ కుమార్, జూకూరి అంజయ్య, పత్తిపాక జనార్దన్, పుల్లారి అచ్చయ్య, తోగరు రమేష్, బుడిగం నరేష్, బచ్చు అశోక్, పోకల వెంకటేశ్వర్లు, దొంగరి శ్రీను పాల్గొన్నారు.

ఫెర్టిలైజర్,పెస్టిసైడ్ దుకాణాలపై తనిఖీలేవి..?

- రైతులకు నకిలీ ఎరువులు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు
- గ్రామ గ్రామాన వెలిసిన ఎరువుల షాపులు
- జోరుగా సాగుతున్న బయో పురుగుమందుల అమ్మకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

తుంగతుర్తి నియోజకవర్గంలోని మండలాల్లో మొన్నటి వరకు మండలానికి 10 లోపు ఎరువుల షాపులు ఉండగా నేడు అవి 50 కి పైగా ఎరువుల షాపులు ఉన్నాయి. ప్రతి గ్రామంలో కూడా ఇబ్బడి ముబ్బడిగా షాపులు ఏర్పాటు చేసుకోవడానికి అధికారులు అనుమతులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. నామ మాత్రంగా తనిఖీలు చేస్తూ మామూళ్లు తీసుకొని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దుకాణాలు కూడా సర్టిఫికెట్లు ఒకరివి నడిపేది మరొకరు .. కనీస అర్హతలు లేకుండా ఎరువుల షాపులు పెట్టుకోవడానికి అనుమతులు ఇస్తుండడంతో వారి ప్రభావం రైతులపై పడుతుంది.

నవతెలంగాణ తుంగతుర్తి

నియోజకవర్గంలోని పలు మండలాల్లో రైతులు యాసంగి వరి పంటకు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికే వరి నారుమడులు సిద్ధం చేసి నాటు వేశారు.ఇదే అదునుగా చేసుకున్న కొంతమంది ఎరువు షాపుల యజమానులు నకిలీ ఎరువులతో పాటు జోరుగా బయో మందులు రైతులకు అంటగట్టినట్లు సమాచారం.ఇటీవల తుంగతుర్తి మండల కేంద్రంలో ఓ ఎరువుల షాపు యజమాని నాసిరకం ఎరువులు అమ్మినట్లు పూర్తి విశ్వసనీయ సమాచారం.ఈ విషయం సంబంధిత అధికారికి తెలిసినా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు పెద్ద ఎత్తున వస్తున్నాయి.రెగ్యులర్ ఏడీఏ లేకపోవడంతో ఉన్న వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఎరువుల షాపులను అజమాయిషి చేయాల్సిన ఏడీఏ, ఏవో,ఏఈఓ లు ఎప్పుడో ఒకసారి తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు.గతంలో వరి విత్తనాల నాణ్యత లోపంవల్ల మొలకలు రాక రైతులు నానా ఇబ్బందులు పడ్డ విషయాలు తుంగతుర్తి మండలంలో చాలా జరిగాయి.అయినా అధికారులు సరైన చర్యలు చేపట్టడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు.

నియోజకవర్గంలో సుమారు 200 కి పైగా ఎరువులు, పురుగు మందుల దుకాణాలు



ఉన్నాయి.

యూరియా రూ.266 ఉంటే 330వరకు అమ్ముతున్నారు. డీఏపీ రూ.1300 ఉంటే 1400-1450 వరకు అమ్ముతున్నారు. మందుబస్తాలపై ఎమ్మార్పీ రేటులేనివి కూడా విక్రయిస్తున్నారు. రైతులకు మాత్రం ఎమ్మార్పీ ధరలకు బిల్లులు రాసి ఇవ్వడం అదనంగా వసూలు చేసే డబ్బులు ఆఫ్ ద రికార్డుగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.ఏ ఎరువు,ఏ విత్తనాలు,ఏ పురుగు మందులు ఎంత ధరలకు విక్రయిస్తున్నారు,కనీసం సూచించే సూచిక బోర్డులుకూడా పెట్టడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు.

పురుగుల మందుల విషయానికి వస్తే అధికంగా బయోమందుల విక్రయాలు తుంగతుర్తి మండలంలో జరుగుతాయని పలువురు మిర్చి సాగు చేసే రైతులు అంటున్నారు. బయో వాడకం వల్ల చేలు దెబ్బతింటాయని బ్రాండెడ్ కంపెనీల



పురుగుమందుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. గతంలో వరి పంటకు కలుపు రావడంతో అట్టి రైతు షాప్ యజమానుని సంప్రదిస్తే అతని ఇచ్చిన కలుపుమందు వాడితే సుమారు 20 ఎకరాల వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో రైతు ఇదేంటి అని ప్రశ్నిస్తే అతడికి గుట్టు చప్పుడు కాకుండా నష్టపరిహారం చెల్లించారు. అధికారులు సూచించకుండానే తమ ఇష్టానుసారంగా పురుగుల మందుల అమ్మకాలు చేస్తున్నా పట్టించుకునే వారే లేరని రైతులు అంటున్నారు.ఆరుగాలం కష్టించి పండించే అన్నదాతకు అన్నింట ఇబ్బందులు ఎదురవుతున్నాయి . ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు ప్రతి దుకాణాన్ని క్షుణ్ణంగా పరిశీలించి బయోమందుల అమ్మకాలను అరికట్టి,అధిక ధరలకు అమ్మే వారి ఆట కట్టించి,నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు అమ్మేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

నాసిరకం మందులు, విత్తనాలు అమ్మే విషయం నా దృష్టికి రాలేదు.

తుంగతుర్తి ఏడీఏ బాలకృష్ణ

నాసిరకం మందులు విత్తనాలు అమ్మే విషయం తన దృష్టికి రాలేదు..వ్యవసాయ శాఖ సూచించిన నాణ్యమైన పురుగుమందులనే ఎంఆర్పీ రేట్లకే విక్రయించాలి. నాసిరకం మందులను అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

వాహనదారులు విధిగా హెల్మెట్, సీట్ బెల్టు ధరించాలి

- అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్, ఏఎస్పీ

నవతెలంగాణ-సూర్యాపేట



ప్రమాదాల బారిన పడకుండా ఎంతో విలువైన ప్రాణాలను కాపాడుకునేందుకు వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్, సీట్ బెల్టు ధరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని జిల్లా పోలీస్, రవాణా శాఖల ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎన్టీఆర్ పార్క్ దగ్గర నిర్వహించిన బైక్ ర్యాలిని ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు.నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతోమంది నిండు ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగిన సమయాలలో విలువైన నిండు ప్రాణాలను కోల్పోతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ప్రతిఒక్కరు హెల్మెట్ ధరించడాన్ని అలవాటుగా చేసుకోవాలని, దీనిని కనీస బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. అదనపు ఎస్పీ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎదుటి వారి వల్ల ప్రమాదాలకు గురైన సందర్భాలలోనూ హెల్మెట్ ప్రాణాపాయ స్థితి నుండి కాపాడుతుందన్నారు. ప్రమాదాలను నిలువరించేందుకు ప్రతిఒక్కరు బాధ్యతాయుతంగా వాహనాలు నడుపుతూ, తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఈ సదర్భంగా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు శిరస్త్రాణం ధరించాల్సిన అవశ్యకతను తెలియజేస్తూ, సూర్యాపేట టూవిలర్స్ అసోసియేషన్ వారు అందజేసిన హెల్మెట్ లను అందజేశారు. హెల్మెట్ ధరించి ప్రయాణిస్తున్న వారిని అభినందించారు. అనంతరం ప్రధాన వీధులగుండా ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆర్ టిఓ సురేష్ రేడ్డి, ఎంవిఐ లు యస్ .జయప్రకాష్ రెడ్డి , ఎ.ఆధిత్య , సిబ్బంది పాల్గొన్నారు.

మీ సేవ కేంద్రం తనిఖీ

నవతెలంగాణ-తిరుమలగిరి



మండల కేంద్రంలోని మీ సేవ కేంద్రాన్ని గురువారం తహశీల్దార్ బి.హరి ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సర్టిఫికెట్లపై ఎక్కువ మొత్తంలో ఫీజు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. .ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంట ఆర్ఐ సుజిత్ రెడ్డి, మండల సర్వేయర్ జోసఫ్ , జూనియర్ అసిస్టెంట్ అశోక్, పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో గ్రామాలు నిర్వీర్యం

- ప్రత్యేక నిధులతో గ్రామాల అభివృద్ధి
- ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి

నవతెలంగాణ-కోదాడరూరల్



గత ప్రభుత్వం గ్రామాలను నిర్వీర్యం చేసిందని ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి అన్నారు. గురువారం అనంతగిరి మండలం పరిధిలోని పలు గ్రామాలలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో ఎంజిఎన్ఆర్ఈజీపి నిధులనుండి మంజూరైన రూ.35 లక్షలతో గ్రామపంచాయతీ భవనం, అంగన్వాడీ భవనాలకు, అంతర్గత సీసీ రోడ్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. గొండ్రియాల గ్రామంలో ఎంజిఎన్ఆర్ఇజిపి నిధులు రూ.20 లక్షలతో గ్రామపంచాయతీ నూతన భవనం, శాంతినగర్ గ్రామంలో రూ.12 లక్షలతో అంగన్వాడి భవనం శంకుస్థాపన, పాలారం గ్రామంలో రూ.32 లక్షలతో గ్రామపంచాయతీ భవనం అంగనవాడి భవనాలు, అదే గ్రామంలో సిఆర్ఆర్ నిధుల నుండి 1.70 కోట్లతో పాలవరం నుండి కిష్టాపురం వరకు బీటీ రోడ్డుకు శంకుస్థాపన, అదే గ్రామంలో ఎంఆర్ఆర్ నిధుల నుండి 1.62 కోట్లతో పాలవరం నుండి వయా రంగయ్య గూడెం మీదుగా సీపడి రోడ్డు వరకు బిటి రోడ్డుకు శంకుస్థాపన, అనంతరం పాలవరం తండాలో రూ.32 లక్షలతో గ్రామపంచాయతీ భవనం అంగన్వాడి భవనాలకు శంకుస్థాపన చేశారు. వసంతాపురం గ్రామంలో రూ.22 లక్షలతో గ్రామపంచాయతీ నూతన భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రతి గ్రామానికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్రావు, ఆర్డీవో సూర్యనారాయణ,అనంతగిరి మండల అధ్యక్షులు ముస్కు శ్రీనివాస్ రెడ్డి,ఎంపీడీవో షేక్ సుష్మ,మాజీ ఎంపీపీ చుండూరు వెంకటేశ్వర్లు,మాజీ జెడ్పిటిసి కొణతం ఉమా శ్రీనివాసరెడ్డి,డిప్యూటీ తహసిల్దార్ శ్రీధర్,కొండపల్లి వాసు,బుర్ర పుల్లారెడ్డి, గునుకుల గోపాల్ రెడ్డి,కొండయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం

నవతెలంగాణ-మఠంపల్లి



మట్టపల్లి మహాక్షేత్రంలో నేటి తెల్లవారుజామున జరిగే వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధమైనట్టు అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, చెన్నూరు విజయ్ కుమార్, కార్యనిర్వాహణాధికారి సిరికొండ నవీన్‌లు తెలిపారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, సాంస్కృతి కార్యక్రమాలు సీతా కళ్యాణం హరికథ, శ్రీలక్ష్మీ నరసింహ సంకీర్తనవంటి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ చరమందరాజు ఆధ్వర్యంలో మఠంపల్లి ఎస్సై పి.బాబు తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు. పూజా కార్యక్రమాల్లో అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, రామాచార్యులు, కృష్ణమాచార్యులు, అద్దేపల్లి లక్ష్మీనాచార్యులు, పద్మనాభచార్యులు, బద్రీనారాయ నాచార్యులు, అంజనేయచారులు మార్తి దుర్గాప్రసాద్ శర్మ లక్ష్మీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

కాశయ్య మృతి పార్టీకి తీరని లోటు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కారేపల్లి శేఖర్‌రావు

నవతెలంగాణ-పాలకీడు



మండల కేంద్రంలో సీపీఐ(ఎం) నాయకులు, మాజీ సర్పంచ్ మీసాల కాశయ్య ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కారేపల్లి శేఖర్‌రావు అన్నారు. గుండెపోటుతో మృతి చెందిన కాశయ్య భౌతిక దేహాన్ని శేఖర్‌రావుతో పాటు మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్, సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి కొదమ గుండ్ల నగేష్‌లు సందర్శించి ఎర్రజెండా కప్పి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా శేఖర్‌రావు మాట్లాడుతూ తాను ఉమ్మడి నేరేడుచర్ల ఎంపీపీగా ఉన్నప్పుడు, పాలకీడు సర్పంచ్‌గా కాశయ్య పనిచేశారని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంతో చిత్తశుద్ధితో, గ్రామ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ పక్షాన వారి కుటుంబానికి సంతాపాన్ని సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పీఏసీఎస్ వైస్ చైర్మెన్ పగడాల మట్టేష్, పీఏసీఎస్ డైరెక్టర్ పాతూరు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ గుర్రం ధనమూర్తి, మాజీ ఎంపీటీసీ దొంగల వెంకటయ్య, వడ్డే సైదయ్య, ఎర్రడ్ల మల్లారెడ్డి, దిద్దకుంట్ల పురుషోత్తం రెడ్డి, మాతంగి ఏసురత్నం, నన్నెపంగా రమేష్, అర్లపూడి వీరభద్రం, రాంరెడ్డి, సోములు, విశాఖ పాల్గొన్నారు.

కాంతారెడ్డి సేవలు మరువలేనివి

నవతెలంగాణ-మునగాల



మండల కేంద్రానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు వుప్పుల కాంతారెడ్డి పార్టీకి అందించిన సేవలు మరువలేనివని డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి గడ్డం వినోద్, పార్టీ శాఖ కార్యదర్శి కిన్నెర వెంకన్న కొనియాడారు. గురువారం పార్టీ కార్యాలయంలో కాంతారెడ్డి ద్వితీయ వర్ధంతిని నిర్వహించి మాట్లాడారు. అతివాద మితవాద ముఠా దోరణలను ఎదిరించి అనేక నిర్బంధాలను తట్టుకుని పార్టీని కంటికి రెప్పలా కాపాడిన నాయకులు కాంతారెడ్డి అని కొనియాడారు. సీపీఐ(ఎం) కోదాడ డివిజన్ కార్యదర్శిగా, జిల్లా రైతు సంఘం నాయకుడిగా, 1970 నుంచి 80 వరకు మునగాల సర్పంచ్‌గా, 10ఏండ్లు సింగిల్ విండో చైర్మన్గా, 45 ఏండ్లు మునగాల లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మెన్‌గా, హుజూర్‌నగర్ ఎల్ఎంబి బ్యాంక్ వైస్ చైర్మెన్‌గా బాధ్యతలు నిర్వహించారని గుర్తుచేశారు. అంతకు ముందు కాంతారెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లపంగి గోపాలం, ఇటికాల వెంకన్న, లంజపల్లి వెంకులు, డీవైఎఫ్ఐ నాయకులు సైదులు, మండవ ప్రశాంత్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-తిరుమలగిరి

మున్సిపాలిటీలోని అంబేద్కర్ నగర్ కి చెందిన కందుకూరి దశరథ బుధవారం రాత్రి మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని గురువారం బహుజన యుద్ధనౌక దండోరా సాంస్కృతిక అధ్యక్షులు ఏపూరి సోమన్న సందర్శించి నివాళులర్పించారు. కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఎమ్మార్పీఎస్ఎంఎస్పీ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి కందుకూరి సోమన్న, కందుకూరి శ్రీను, కందుకూరి లక్ష్మయ్య పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని వినతి

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, నూతన వ్యవసాయ విధానాన్ని తక్షణమే విరమించుకోవాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏ ఐ యు కె ఎస్) జాతీయ కమిటీ పిలుపులో భాగంగా గురువారం సూర్యాపేట కలెక్టర్ కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆ సంఘం డివిజన్ నాయకులు పొన్నాల లచ్చిరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఉన్న ప్రజలు కార్మికులు రైతులు అన్ని వర్గాల ప్రజలు ప్రజా సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. పంటకు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలకు పూనుకుంటున్నారన్నారు. మద్దతు ఇవ్వాల్సిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను మోసం చేస్తున్నాయన్నారు . చట్టసభల్లో ఎంఎస్పీ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీ రాష్ట్రంలో పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. ,, రైతు భరోసాను కూడా ఎలాంటి ఆంక్షలు లేకుండా తక్షణమే అమలుకు పూనుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సామ సత్తిరెడ్డి, గోగుల వీరబాబు,శంకర్, జాన్ సుందర్,మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం తగదు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట గోపి

నవతెలంగాణ-మద్దిరాల



రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం తగదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట గోపి అన్నారు. గురువారం మండలంలోని పోలుమళ్ళ లో నిర్వహించిన ఆ పార్టీ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు మినహా మరే పథకం కూడా సక్రమంగా అమలు జరగడం లేదన్నారు. ఉచిత బస్ పథకంలో బస్సుల సంఖ్య పెంచాలన్నారు. రైతాంగానికి రెండు లక్షల రుణమాఫీకి సక్రమంగా జరగక చాలామంది రైతులు ఎదురుచూస్తున్నారని అన్నారు.సంక్రాంతి తర్వాత రైతు భరోసా ఎకరానికి పదిహేను వేల రూపాయలు ఇస్తామని చెప్పి 12 వేలకే కుదించడం సరికాదన్నారు. భూమిలేని వ్యవసాయ కూలీలందరికీ 12 వేల రూపాయలు ఇస్తామని చెప్పి ప్రభుత్వం నేటికీ విధివిధానాలు ప్రకటించలేదన్నారు. షరతులు విధించకుండా భూమి లేని నిరుపేదలందరికీ కచ్చితంగా రూ.12 వేల అందించాలని డిమాండ్ చేశారు.ఇందిరమ్మ ఇండ్ల పై జరుగుతున్న సర్వే పారదర్శకంగా జరపాలని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి పోలోజు సైదులు, నాయకులు ఆకుల రమేష్, పాతూరి మల్లారెడ్డి,చిదిరాల నారాయణ,చిలువేరు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

- టీజేయస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్

నవతెలంగాణ-సూర్యాపేట

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేయడానికి తెలంగాణ జన సమితి కార్యకర్తలు నాయకులు సిద్ధం కావాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ,నియోజకవర్గ ఇంచార్జ్ కుంట్ల ధర్మార్జున్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థలలో విద్యావంతులైన నిజాయితీపరులైన యువకులను రాజకీయాలకు తీసుకొచ్చి వారిని ప్రోత్సహించి ఎన్నికల్లో నిలబెట్టాలని ఆయన పార్టీ నాయకులను కోరారు. ఈ సమావేశంలో యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్. పార్టీ జిల్లా కార్యద్శి బొడ్డు కిరణ్ గౌడ్ రైతు జన సమితి జిల్లా అధ్యక్షులు కొల్లు కృష్ణారెడ్డి , ఎస్ సి సెల్ జిల్లా కన్వీనర్ బచ్చలకురి గోపి, ఆత్మకూరు మండల అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్, పెంపహాడ్ మండల కన్వీనర్ పాను గోత్ సూర్యనారాయణ , చివ్వెంల మండల అధ్యక్షులు సుమన్ నాయక్ , తదితరులు పాల్గొన్నారు.

రూ.1.60 కోట్లతో ఉడాయించిన వ్యాపారి

- 50 మందికి పైగా అప్పులిచ్చిన బాధితులు
- అప్పు ఇప్పించిన మధ్యవర్తులు పోలీస్ స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు

నవతెలంగాణ-కోదాడరూరల్



పలువురి నుంచి సూమారు రూ.1.60 కోట్లు అప్పు తీసుకొని ఓ వ్యాపారి ఉడాయించిన ఘటన పట్టణ పరిధిలో చోటుచేసుకొని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం బాధితులు టౌన్ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని సీఐ, డీఎస్పీలను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. కొంతమంది నమ్మించి మాయమాటలు చెప్పి వారి వద్ద నుండి లక్షల రూపాయలు తీసుకుంటున్నారు. మరికొంతమంది మధ్యవర్తిగా ఉండి డబ్బులు ఇప్పించారు. వారి పరిస్థితి మరి దారుణంగా తయారైంది. తీసుకున్న అప్పులు కోటి రూపాయలు దాటడంతో చివరికి ముంచి వెళ్లిపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. మండల పరిధిలోని కాపుగల్లు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పట్టణంలోని అనంతగిరి రోడ్డులో ఫ్యాన్సీ స్టోర్ నడుపుతున్నారు. ఫాన్సీ స్టోర్ నడుపుతూ ఉండడంతో గ్రామానికి చెందిన 15 మంది వ్యక్తులు సదరు వ్యక్తికి కోటి రూపాయలకు పైగా అప్పు ఇచ్చారు. అంతేకాకుండా పట్టణంలో 35 మంది కూడా సుమారు రూ.60 లక్షలకు మేరా అప్పు ఇచ్చినట్టు సమాచారం. తీసుకున్న అప్పుకి వడ్డీ పెరుగుతున్న నేపథ్యంలో ఇవ్వాలని సదరు బాధితులు వ్యాపారిపై ఒత్తిడి తీసుకురావడంతో ఒత్తిడి తట్టుకోలేని వ్యాపారి పరారీ అయినట్లుగా సమాచారం. వ్యాపారి గత రెండు మూడు రోజులుగా కనిపించకపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. వ్యాపారి ఒక యువ లాయర్ సలహా తోటే పరారీ అయినట్లుగా ఐపీ పెట్టేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లుగా బాధితులు తెలుపుతున్నారు. ఈ విషయం బయటపడిన అప్పటినుండి బాధితులు ఒక్కొక్కరుగా వస్తున్నారు. ఇంకా ఎంతమంది బాధితులు ఉంటారో తెలియదు. ఇంకా ఎన్ని లక్షల రూపాయలు పెరగవచ్చు కూడా తెలియదు అని బాధితులు తెలుపుతున్నారు.

అందరికీ అందుబాటులో ఉండే నాయకుడు గండూరి ప్రకాష్

- బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-సూర్యాపేట



ఎల్లప్పుడూ అందరికీ అందుబాటులో ఉండే నాయకుడు గండూరి ప్రకాష్ అని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గండూరి ప్రకాష్ జన్మదినం సందర్భంగా గురువారం పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ప్రకాష్ నివాసం వద్ద ఏర్పాటు చేసిన బారీ కేక్ ను ఆయన కట్ చేసి మాట్లాడారు. పార్టీ రాష్ట్ర నాయకులుగా, సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్‌గా గండూరి ప్రవల్లిక ప్రకాష్ దంపతులు విశేష సేవలు అందించారని కొనియాడారు. అదేవిధంగా కుమారుడు గండూరి ప్రీతం జోనా జ్ఞాపకార్థం పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సేవ సంస్థ ద్వారా నిరుపేద ప్రజలకు చేయూత అందిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు వివిధ రకాల పండ్లతో కూడిన ఫ్రూట్ బాక్స్ లను పంపిణీ చేశారు. అత్యవసర సమయంలో రోగులను ఆదుకునేలా రక్తదానం చేశారు.అనంతరం ప్రకాష్ నివాసం వద్ద బాణా సంచా కాల్చి బారీ కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు చక్రహరి నాగరాజు, వల్దాస్ జానీ, మోత్కూరి సందీప్, బైసన్ శ్రీనివాస్,రాచకొండ కృష్ణ,ఎలుగూరి రామ్మూర్తి , నాగేశ్వరరావు, పండు, సాయి, హరీష్, రాజేష్, జలంధర్,సుదర్శన్, అరవింద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అంగడి ఎల్లయ్య సేవలు అభినందనీయం



- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పంగ రవి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఎన్‌డిఆర్, నాయకులు అంగడి ఎల్లయ్య సేవలు అభినందనీయమని, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పంగ రవి అన్నారు. ఆలేరు మండలం, మందనపల్లి గ్రామంలో సీపీఐ(ఎంఎల్) ఎన్డీఆర్ నాయకులు ఎల్లయ్య సంతాప సభ, ఐఎఫ్టియు రాష్ట్ర నాయకుడు పంగ అంజయ్య అధ్యక్షతన నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి, 2 నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పి ఓ డబ్ల్యు రాష్ట్ర కన్వీనర్ పంగ వరలక్ష్మి, పిడిఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు తుంగ శ్రవణ్ కుమార్, ప్రైవైల్ రాష్ట్ర నాయకులు పంగ నాగరాజు, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు జాన్నె మల్లేష్, కోశాధికారి కొత్తపేట చంద్రయ్య, అంగడి ఎల్లయ్య కుమారులు అంగడి కరుణాకర్, అంగడి సూర్యం, కూతుళ్ల పద్మ కస్తూరి, అంజుల పాల్గొన్నారు.

న్యాయవాదిగా గొట్టిపాముల శరణ్య



నవతెలంగాణ-భువనగిరి

బార్ అసోసియేషన్ హాలులో నూతన న్యాయవాది గొట్టిపాముల శరణ్య పరిచయ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ సీనియర్ న్యాయవాది గొట్టిపాముల బాబురావు కూతురు శరణ్య నాయవాదిగా పరిచయం కావడం న్యాయ వృత్తిని కొనసాగించడం ఆశించదగిన పరిణామమని, న్యాయవాద వృత్తిలో ఆమె ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆశీర్వాదించారు. ఈ కార్యక్రమానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బబ్బూరి హరినాథ్, ఆలేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూకంటి రవి, సీనియర్ న్యాయవాదులు గొట్టిపాముల బాబురావు, వంచ దామోధర్ రెడ్డి, నాగారం అంజయ్య, నక్కల మల్లేష్, విజయ భాస్కర్ రెడ్డి, శ్రీకాంత్, శ్రీధర్, లింగారెడ్డి, జి,రవిందర్ రెడ్డి, గుండ్ల స్వామి, రాజిరెడ్డి, జయ,హైకోర్టు సీనియర్ న్యాయవాది సురేష్, జిల్లా కోర్టు పీపీ శ్రీనివాస్‌రెడ్డి, సుదగాని రవి కుమార్, కుక్కదువ్వు సోమయ్య, సీనియర్ జర్నలిస్టు ఎర్ర జాన్సన్ హాజరై ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

భూమి ఇస్తామన్నా.. ముందుకు రాని అధికారులు

- చేజారి పోనున్న రూ.15 కోట్లు విలువగల భూమి

నవతెలంగాణ-సంస్థాన్ నారాయణపురం

మండలంలోని రాచకొండ గ్రామపంచాయతీ పరిధిలో సర్వేనెం.5 నుంచి 84లలో హైదరాబాదుకు చెందిన ఓసియన్ ప్రెస్టేజ్ పార్కు వారు 2007లో 926 ఎకరాలు రైతుల నుండి కొనుగోలు చేసి బీ1నుంచి బి7 వరకు బ్లాక్‌లుగా విభజించి లేఔట్ చేశారు. 10 శాతం భూమి కింద గ్రామ పంచాయతీకి ఇవ్వాల్సిన 92 ఎకరాల భూమి లేఅవుట్లో చూయించిన భూమిని గ్రామపంచాయతీ పేరున రిజిస్ట్రేషన్ చేయలేదు. 2007 జూన్ 12న గ్రామ పంచాయతీ తీర్మానం పొంది ప్లాట్లను ఆన్లైన్లో అమ్మేశారు. బి1, బి2 బ్లాకులు మినహాయిస్తే మిగిలిన బ్లాక్‌లు కొండలు పెద్ద పెద్ద బండరాళ్లతో కూడుకున్నవిగా ఉన్నాయి. ఈ లేఅవుట్‌కు సంబంధించిన భూమిపై మొదటి నుంచి విజిలెన్స్ కేసు నమోదయి ఉంది. లేఅవుట్‌కు సంబంధించి సరిహద్దు వివాదాలు తలెత్తడంతో కొంతమంది ప్లాటు ఓనర్స్ కలిసి రాచకొండ ప్రెస్టేజ్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పేరున సొసైటీని ఏర్పాటు చేసుకున్నారు. 2015లో ప్రభుత్వంతో రిజిస్ట్రేషన్ చేసుకుని ప్లాట్ల అభివృద్ధికి పనిచేస్తున్నారు. ప్రభుత్వ సర్వేయర్ రిపోర్టు ప్రకారం లేఅవుట్‌ను రివైజ్ చేసుకుని తగిన అనుమతులను గ్రామపంచాయతీ నుండి తీసుకొని పనిచేస్తున్నారు. అనంతరం బ్లాక్‌ల వారీగా ప్లాట్ ఓనర్స్ సొసైటీలను ఏర్పాటు చేసుకొని పనిచేస్తున్నారు.154.30 ఎకరాల విస్తీర్ణంలో 870 ప్లాట్లు కలిగిన బీ2 బ్లాక్‌లో గ్రామపంచాయతీకి ఇవ్వాల్సిన 10శాతం భూమి కింద15.19 ఎకరాలు, బి1లో 190 ఎకరాల భూమి శాతం కింద 19 ఎకరాలు గ్రామపంచాయతీకి రావాల్సి ఉంది. బి1, బి2లో మొత్తం 34 ఎకరాలు సుమారు రూ.15 కోట్ల విలువ కలిగిన భూమిని





గ్రామపంచాయతీ పేరును రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్లాట్ ఓనర్స్ స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ (ఎస్పిఎ) తీసుకునీ సిద్ధంగా ఉన్నారు. గ్రామ పంచాయతీకి ఇవ్వాల్సిన భూమిని గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు జిల్లా సబ్ రిజిస్టర్‌ను కలిసినట్లు తెలిసింది. జిల్లా సబ్ రిజిస్ట్రార్ అప్రోవల్‌తో చౌటుప్పల్ సబ్ రిజిస్టర్ వద్దకు వెళ్లిన వారికి నిరాశ ఎదురైనట్లు తెలిసింది. గ్రామపంచాయతీ కార్యదర్శి లెటర్ గాని, లేదా గిఫ్ట్ రిజిస్ట్రేషన్ ఫీజు కడితేనే చేసుకుంటామని కోరీలు పెట్టినట్లు తెలుస్తుంది. ఇప్పటికే రాచకొండ గ్రామపంచాయతీకి చెందాల్సిన పదుల ఎకరాల భూమి దుర్వినియోగం అవుతున్నా కాపాడకుండా నిర్లక్ష్యం చేస్తున్న అధికారులు ఇస్తామన్న భూమిని తీసుకోకుండా కొర్రీలు పెట్టడంలో అంతర్యమేమిటాని పలువురు గిరిజనులు అనుమానిస్తున్నారు. ఎస్పిఎ కాలపరిమితి దాటితే రూ.15 కోట్ల విలువగల భూమి గ్రామ పంచాయతీకి చెందిన కొండ చేజారిపోయే ప్రమాదం ఉంది. ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ వారు గ్రామపంచాయతీకి ఇస్తామన్న 34 ఎకరాల భూమిని వెంటనే గ్రామ పంచాయతీ పేరున గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పలువురు గిరిజనులు కోరుతున్నారు.

విజిలెన్స్ కేసు ఉన్నందున ఆలస్యం జరుగుతోంది: ఎంపీవో నరసింహారావు

రాచకొండలో ఓసియన్ ప్రెస్టేజ్ పార్కు వారు చేసిన లేఔట్ పై విజిలెన్స్ కేసు ఉంది. మొత్తం వెంచర్ కు సంబంధించి10 శాతం భూమి కింద 92 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. కేవలం బీ2 సంబంధించిన వాళ్ల 15.19 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేస్తామని ఓనర్స్ ఎస్పియాతో ముందుకు వచ్చారు. విజిలెన్స్ వాళ్ళ సుమతి కోసం లేఖ రాస్తున్నాం. విజిలెన్స్ వాళ్ళు ఒప్పుకుంటే తీసుకుంటాం.

ఇస్తానన్న భూమిని వెంటనే సాధనం చేసుకోవాలి: మాజీ సర్పంచ్ ఒగ్గు గణేష్

గ్రామ పంచయతీకి వెంచర్ యజమానులు ఇస్తామన్న 10 శాతం భూమిని వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. పంచాయతీ కార్యదర్శి లేక అందజేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆలస్యం చేస్తే గ్రామపంచాయతీకి రాకుండా ఉండే ప్రమాదం ఉంది. ఇప్పటికే దుర్వినియోగమైన గ్రామపంచాయతీ భూమిని తిరిగి సాధినం చేసుకోవాలి.

అవమానాన్ని భరించలేక గృహిణి ఆత్మహత్య !

- మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని బంధువుల ఆందోళన





నవతెలంగాణ-రామన్నపేట

దొంగతనం అభాండం మీదేయడంతో అవమానాన్ని భరించలేక ఓ గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సిరిపురం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన రాపోలు నరేష్ కర్నూలు జిల్లా ఆదోని మండలానికి చెందిన రమ్యను ప్రేమించి 12 ఏండ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. వారికి ఒక కుమారుడు ఒక కూతురు ఉన్నారు. అదే గ్రామానికి చెందిన పావని హయత్ నగర్ మండలంలోని మునగనూరులో నివాసం ఉంటున్నారు. ఈనెల 5న మానస కొడుకు పుట్టినరోజు వేడుక ఉండగా ఆహ్వానించడంతో ఆదివారం నరేష్ రమ్య దంపతులు హయత్‌నగర్‌కు వెళ్లారు. జంగిలి మురళి దంపతులు కూడా వచ్చారు. ఆరోజు అక్కడే నిద్రించి సోమవారం ఉదయం సిరిపురం గ్రామానికి నరేష్ దంపతులు చేరుకున్నారు. ఈనెల 6న సాయంత్రం మానస ఫోన్ చేసి మురళి వారి యొక్క రెండు తులాల బంగారు నగలు పోయినవి నీకేమైనా దొరికిందా అని అడిగింది. కొద్ది సమయం తర్వాత మురళి ఫోన్ చేసి బంగారం పోయింది నీ భార్య దొంగిలించింది అని గట్టిగా వాదించాడు. తమకు సంబంధం లేదని, తాము బంగారం తీయలేదని చెప్పినా వినకుండా వాదిస్తూనే హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మరుసటి రోజు స్టేషన్ నుండి ఫోన్ రావడంతో అక్కడికి వెళ్లి ఎస్ఐని కలిశారు. ఎస్ఐ ముందే మురళి రూ.50 వేలు ఖర్చుపెట్టి మిమ్మల్ని రౌడీలతో కొట్టిస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో మానసిక వేదన, అవమానభారానికి గురైన రమ్య గురువారం తెల్లవారుజామున నైట్ ఆఫ్ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. రమ్య భర్త నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై పి మల్లయ్య పేర్కొన్నారు.

బంధువుల ఆందోళన

అవమానభారం భరించలేక ఆత్మహత్య చేసుకున్న నరేష్ భార్య రమ్య బంధువులు పోలీస్‌స్టేషన్ సమీపంలోని భోనగిరి రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. రమ్య కుటుంబానికి న్యాయం జరగాలని, అసలైన దోషులను గుర్తించి శిక్షించాలని, అవమానభారానికి గురిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐ ఎన్ వెంకటేశ్వర్లు జోక్యం చేసుకొని, దోషులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో బంధువులు ఆందోళనను విరమించారు.

ఫాతిమా షేక్ జయంతి

నవతెలంగాణ-భువనగిరి

భువనగిరి ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో భారతదేశ మొట్ట మొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ,సావిత్రి బాయ్ పూలే సహచరురాలు ఫాతిమా షేక్ జయంతి సందర్భంగా భువనగిరి పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద వారి చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మైనారిటీ గురుకులాలలో అధికారికంగా జయంతిని జరిపే విధంగా ఆదేశాలు జారీచేసిన ముఖ్యమంత్రికి భువనగిరి ముస్లిం జేఏసీ తరపున ధన్యవాదాలు తెలిపారు.

టీఎస్‌యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్



భువనగిరి మండల ఎంఆర్‌సీలో టీఎస్‌యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను మండల విద్యాశాఖ అధికారి పి నాగవర్ధన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జివి రమణ రావు, జిల్లా కార్యదర్శి వెంకర్ల శ్రీదేవి, భువనగిరి మండల అధ్యక్షుడు పి సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి రవీందర్, సీనియర్ నాయకులు జి వెంకటేశం, కోశాధికారి జె మల్లేశం, టౌన్ బాధ్యులు హనుమాన్‌రావు పాల్గొన్నారు.

20న కలెక్టరేట్ ముట్టడి



నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

మండలంలోని బండసోమవారం గ్రామంలో అండర్ పాస్ సాధన కమిటీ ఆధ్వర్యంలో అండర్పాస్ సాధన గ్రామ కమిటీ అధ్యక్షులుగా మజ్జిగ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సిలివేరు అశోక్ ఎన్నుకున్నట్లు వండర్ పాస్ సాధన కమిటీ కన్వీనర్ సిల్వర్ ఎల్లయ్య కో కన్వీనర్ కంచి మల్లయ్య, మందడి సిద్దారెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన కలెక్టర్ కార్యాలయం ముట్టడి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిలివేరు మధు, అశోక్, శంకర్ రెడ్డి, బలరాం, కుమార్, బాలరాజ్, జంగయ్య, పాండు, కృష్ణ,నాయుడు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కలిసిన నాయకులు



నవతెలంగాణ-ఆలేరుటౌన్

హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో గురువారం మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో, సిద్దిపేట శాసనసభ్యులు మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి లను గురువారం కొలనుపాక మాజీ సర్పంచ్, బీ ఆర్ ఎస్ మండల అధ్యక్షులు గంగుల శ్రీనివాస్ , బహదూర్ పేట మాజీ సర్పంచ్ జంపాల దశరథ, బీ ఆర్ ఎస్ యాదగిరి గుట్ట మండల బీ సి సెల్ అధ్యక్షులు కౌడే మహేందర్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. బి ఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా హరీష్ రావు సూచించారు.

మెస్ చార్జీలు పెంచాలి

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్



భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నాగారం గ్రామ శాఖ ఆధ్వర్యంలో హైస్కూల్ గురువారం మధ్యాహ్నం భోజనం సర్వే నిర్వహించారు. విద్యార్థులతో కలిసి వాళ్ళ సమస్యలు తెలుసుకున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం పథకంలో విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచి ప్రోటీన్ భోజనం అందించాలని మెనూ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వారు ప్రభుత్వం డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్లో ఉన్న బిల్స్ తక్షణమే రిలీజ్ చేసి మధ్యాహ్న భోజనం విషయంలో న్యాయం చేయాలన్నారు పెండింగ్లో ఉన్న బిల్లులు రాకపోవడంతో వలన కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ గ్రామ శాఖ ఉపాధ్యక్షులు చిలకరాజు శివ, వర్కాల విఘ్నేష్, కె మహేష్, కె.అఖిలేష్ పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- విధులకు హాజరుకాని పలువురికి షోకాజ్ నోటీసులు

నవతెలంగాణ-బొమ్మలరామారం



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధులకు హాజరుకాని డాక్టర్ శ్రీహర్షకి, ల్యాబ్ టెక్నీషియన్ మమత, సుమతి ఎంపీహెచ్ఎస్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పని హెచ్చరించారు. ఈ సందర్భంగా సిబ్బంది యొక్క అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించి, ఎంతమంది సిబ్బంది విధులకు హాజరయ్యారని, ఎంత మంది సిబ్బంది ఆబ్సెంట్ అయ్యారని ఆరాతీశారు. అత్యవసర విభాగం సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలన్నారు. హాస్పిటల్‌లో ఉన్న ల్యాబ్‌ను పరిశీలించారు. ఓపి రిజిస్టర్‌ను పరిశీలించి, ప్రతి రోజు ఎంతమంది పేషెంట్లు ఆస్పత్రికి వస్తున్నారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువగా ఏప పేషెంట్లు వస్తున్నారని కలెక్టర్ అడగగా, జలుబు, దగ్గు వచ్చిన వారు వస్తున్నారని మెడికల్ ఆఫీసర్ తెలిపారు. మందుల స్టాక్ గురించి అడిగి తెలుసుకున్నారు. మందుల కొరత లేకుండా చూడాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఆసుపత్రిలో ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయని ఆరా తీశారు. గర్భిణీలు డెలివరీ కోసం ప్రయివేట్ హాస్పటల్‌కు ఎందుకు వెళ్తున్నారని పేషెంట్ కుటుంబ సభ్యులకు కలెక్టర్ ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఉన్నవార్డులను కలెక్టర్ పరిశీలించారు. హాస్పటల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మెరుగైన సేవలు అందించాలని ఆసుపత్రి నిర్వహణ మెరుగ్గా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సుమలత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికీ బీటీ రోడ్లు ఏర్పాటు



- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

నవతెలంగాణ-ఆత్మకూరు ఎం

ఆలేరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో రూ.1.75 కోట్ల నిధులతో డబుల్ రోడ్డు నిర్మాణానికి, రూ.12 లక్షల నిధులతో నిర్మించనున్న అంగన్వాడి భవనముకు శంకుస్థాపన చేశారు. గోదావరి జలాలతో నిండిన వీర్ల చెరువు వద్ద ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రైమరీ స్కూల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 120 చెరువులను గోదావరి జలాలతో నింపడం జరిగిందని, ప్రతి గ్రామానికి గోదావరి జలాలతో త్రాగు,సాగు అందిస్తానని అన్నారు. అసంపూర్తిగా ఉన్న బునాది గాని కాలువ నిర్మాణ పనులను మార్చి నెలలో ప్రారంభిస్తామని అన్నారు. మండల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయానికి కార్యకర్తలు అందరూ కలిసి కృషి చేయాలని చెప్పారు. అనంతరం ఆత్మకూరు, కొరటికల్ గ్రామాల మధ్య గల బిక్కేరు వాగుపై 4.61 ఓట్ల నిధులతో నిర్మించిన చెక్ డ్యాం వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మండలంలోని మురిపిరాల గ్రామంలో ఐదు లక్షల నిధులతో నిర్మించనున్న సిసి రోడ్డుకు, మొరిపిరాల నుంచి వయా కాల్వపల్లి, సింగారం గ్రామం వరకు4.50 నిధులతో నిర్మించే బీటీ రోడ్డుకు, సింగారం గ్రామంలో 5 లక్షలతో నిర్మించే సిసి రోడ్డు లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మోత్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నూనెముంతల విమల వెంకటేశ్వర్లు మండల ప్రత్యేక అధికారి వనం రాజారాం ఎంపీడీవో రాములు నాయక్ ఎంఈఓ మాధవహారెడ్డి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాస లక్ష్మారెడ్డి మాజీ ఎంపీపీ తండ మంగమ్మ శ్రీశైలం గౌడ్ మాజీ సర్పంచ్ జన్నాయి కోడె నగేష్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం వినోద, నరసింహ, పిఎసిఎస్ డైరెక్టర్లు నోముల వెంకటరెడ్డి, తండ నరసింహ మాజీ ఉపసర్పంచ్ దొంతరబోయిన నవ్య భాస్కర్ అఖిలపక్ష నాయకులు రచ్చ గోవర్ధన్, కందడి అనంతరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ముద్దసాని సుద్దులు బత్తిని ఉప్పలయ్య రాచమల్ల సత్తయ్య, పంజాల వెంకన్న, పోతగాని మల్లేశం, లోడి వెంకటయ్య, కోరే మల్లేశం పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- జిల్లా విద్యాధికారి సత్యనారాయణ

నవతెలంగాణ-ఆత్మకూరు ఎం



ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అందించే మధ్యాహ్న భోజనాన్ని నాణ్యమైన, పౌష్టికమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని జిల్లా విద్యాధికారి సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని కూరెళ్ళ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద మధ్యతరగతి విద్యార్థులకు న్యాన్యమైన విద్యాబోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మిరియాల దామోదర్ ఉపాధ్యాయులు వంట ఏజెన్సీలు తదితరులు పాల్గొన్నారు.

యువత దేశ రక్షణలో ముందుండాలి

- గ్రూప్ కమాండర్ కల్నల్ అనిల్ కుమార్ (హైదరాబాద్ గ్రూప్ ఎన్‌సీసీ)

నవతెలంగాణ-బొమ్మలరామారం



విద్యార్థులు, యువత దేశ రక్షణలో ముందుండాలని, విద్యార్థి దశలో లక్ష్యంతో కష్టపడితే ఏదైనా సాధించోచ్చని గ్రూప్ కమాండర్ కల్నల్ ఎన్‌సీసీ అనిల్‌కుమార్ అన్నారు. గురువారం బొమ్మలరామారం మండలంలోని రంగాపూర్ గ్రామంలోని హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీ కళాశాలలో నిర్వహించిన ద్వితీయ సంవత్సరం వీడ్కోలు పార్టీలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలు శరీరిక దృఢత్వం ఏకాగ్రతకు పెంపొందిస్తాయని పేర్కొన్నారు. జూనియర్ ఇంటర్మీడియట్ తోను, డిఫెన్స్ ఆర్మీ కోర్సులతోనూ అదనంగా అభ్యసించడం గొప్ప అవకాశం అన్నారు. విద్యార్థి దశలోనే క్రమశిక్షణతో పాటుగా కాలమానపట్టికను రూపొందించుకునే సమయపాలనలో ముందుకు సాగినప్పుడే గొప్పగా ఎదిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ కోరె రాజ్ కుమార్ మాజీ ఎమ్మెల్యే కేలిరెడ్డి వెంకట్ రామిరెడ్డి కి శాలువాతో సన్మానం చేశారు. ఐఎఎస్ ప్రణయ్ సందీప్,హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ డాక్టర్ కోరె రాజకుమార్, డైరెక్టర్ నవ్యశ్రీ, డిఫెన్స్ చీఫ్ మెంబర్ రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ అంజయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.

కార్మికులకు చట్టపరమైన హక్కులు కల్పించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దాసరి పాండు

నవతెలంగాణ-భువనగిరి



మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు చట్టపరైన హక్కులు కల్పించకపోతే సమ్మెకు సిద్ధం అని సిఐటియు దాసరి పాండు అన్నారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో పురపాలక సంఘం కార్యాలయం ముందు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేశారు. ఈ సందర్భంగా దాసరి పాండు మాట్లాడుతూ భువనగిరిలో పురపాలక సంఘంలో ఏండ్ల తరబడిగా మున్సిపల్ కాంటాక్ట్ కార్మికులుగా పనిచేయుచున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించకపోవడం వలన కార్మికుల కుటుంబాలలో అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్మికులకు రెగ్యులర్ చేయకపోవడం వలన 60 జీవోను అమలు చేయకపోవడం ప్రభుత్వంనిర్లక్ష్యం కార్మికులచే వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా పాలకులు మారినా కార్మికుల బతుకులు మాత్రం మారలేదని రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులపై నిర్లక్ష్యం చేస్తుందన్నారు. స్థానికంగా చట్టపరమైన హక్కులను అన్ని రకాల సెలవులు పెండింగ్లో ఉన్న పీఎఫ్ ను చెల్లించాలని కార్మికునికి అకస్మాత్తుగా కుటుంబంలో సమస్యలు వస్తే పనికి రావద్దని ఇబ్బంది గురి చేస్తున్నారని తెలిపారు. స్థానికంగా ఉన్న అధికారులు వేధింపులు చేస్తున్నారన్నారు. ఈ సమస్యలను పరిష్కరించని యెడల సమ్మెకు వెళ్లామని వారన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు మాయ కృష్ణ, ఊదరి రామచందర్, సల్ల రాజయ్య, బట్టు కొండయ్య, రవి, ఆడెపు వెంకటేష్, మల్లికార్జున, కొమ్ము వరమ్మ, శాంతమ్మ, ఉప్పు కుమారి, మంజుల, యాదమ్మ, నర్సమ్మ, సునీత శ్యామల పాల్గొన్నారు.

అలుగుబెల్లిని ఎమ్మెల్సీగా మరోసారి గెలిపించాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు దొడ్డి స్వామి, కంచి రవికుమార్



నవతెలంగాణ-రామన్నపేట

వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శులు దొడ్డి స్వామి, కంచి రవికుమార్ కోరారు. రామన్నపేట మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం 2025 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్, స్టిక్కర్ క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయాలని, రెసిడెన్షియల్ పాఠశాలలో కెర్ టేకర్లను నియమించాలని, బీఈడీ ఉన్న ఉపాధ్యాయులకు పిఎస్ హెచ్‌ఎంగా పదోన్నతులలో అవకాశం కల్పించాలని, డీఏలు, కొత్త పీఆర్సి ప్రకటించాలని, జాతీయ విద్యా విధానం 2020ని అమలు చేయకూడదని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ ఇలా సోషల్ మీడియా కన్వీనర్ అనిల్ కుమార్, రామన్నపేట మండల కమిటీ అధ్యక్షులు బాసరాజు యాదగిరి, ప్రధాన కార్యదర్శి మంకాల కుమారస్వామీ, కోశాధికారి త్రివేణి ప్రసాద్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జనం పల్లి ప్రధానోపాధ్యాయులు విజయ్ మాధవి, ఉపాధ్యక్షులు నీలం శేఖర్, కార్యదర్శి మధు బాబు, రేవతి, మంజుల, వెంకటయ్య శేషా చారి, పిచ్చిరెడ్డి, మట్టా రెడ్డి, ఆనందరావు, ఘాసి రామ్, కృష్ణయ్య అజీజ్ హుస్సేన్ ఖురేషి, పాల్వంచ హరికిషన్ పాల్గొన్నారు.

కాళేశ్వరం దండగ అని.. నీరు విడుదల చేయడం హాస్యాస్పదం

- మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మెన్ డాక్టర్ అమరేందర్ గౌడ్

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్



కాళేశ్వరం దండగ ప్రాజెక్టు అని ఇప్పుడు నీటిని విడుదల చేయడం హస్యాస్పదం అని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ జడలు అమరేందర్ గౌడ్, జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు కొల్పుల అమరేందర్‌లు అన్నారు. గురువారం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించి మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షులు జనగాం పాండు, పార్టీ పట్టణ అధ్యక్షులు ఎవి కిరణ్ కుమార్, మాజీ జెడ్పిటిసి సుబ్బూరు బీరు మల్లయ్య మాట్లాడుతూ.. నిన్న తుర్కపల్లి మండలం పల్లెపహాడ్ వద్ద గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కెనాల్ వద్దకు వెళ్లి నీటిని విడుదల చేస్తూ భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ రెడ్డి మేమే పనులు పూర్తి చేసి భువనగిరి చెరువులోకి నీటిని తీసుకు వస్తున్నామని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ ఎనబోయిన ఆంజనేయులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అబ్బగాని వెంకట్ గౌడ్, సందెల సుధాకర్, రచ్చ శ్రీనివాస్ రెడ్డి, కస్తూరి పాండు, కంచి మల్లయ్య, సింగిరెడ్డి నర్సిరెడ్డి, ఇట్టబోయిన గోపాల్, రాకల శ్రీనివాస్, తాడెం రాజశేఖర్, ఎండి ఇక్బల్ చౌదరి, యండి ఖాజం, పెంట నితీష్, అశోక్, నాగులు, సూరజ్‌లు పాల్గొన్నారు.

బడుగుల జీవితాల్లో వెలుగులు నింపిన ఫాతిమా షేక్



నవతెలంగాణ-ఆలేరుటౌన్

రెండు శతాబ్దాల క్రితమే బడుగులకు విద్యాబుద్ధులు నేర్పి, వారి జీవితాల్లో వెలుగులు నింపిన తొలి తరం విద్యా దేవత ఫాతిమా షేక్ అని, ప్రేమ సేవా సదనం స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ మొహమ్మద్ ఖుర్షీద్ పాషా అన్నారు. ఆలేరు మండల కేంద్రంలో గురువారం రహదారి బంగ్లాలో ఫాతిమా షేఖ్ 194వ జయంతిని, ప్రేమ సేవా సదనం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ముందుగా ఆమె చిత్ర పటానికి నివాళులు అర్పించి మాట్లాడారు. జ్యోతిభా పులే సావిత్రిలతో కలిసి, మహిళలకు, దళితులకు విద్యా బుద్ధులు నేర్పించిన తొలి తరం పంతులమ్మ అన్నారు. ఆమె ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మాజీ సర్పంచ్ ఆకవరం మోహన్ రావు, మామిడాల భిక్షపతి, ఎం. డి.సలీం, మొరిగాడి మహేష్, ఎం ఏ ఇక్బాల్,షబ్బీర్, కళ్లెపు అద్వయ్య, ఆనంద్ కుమార్, ఫక్రుద్దీన్, అలీమొద్దీన్, గౌస్, జమాల్, పరశు రాములు, వెంకటేష్, సిద్దులు, సాయి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాలుగు ఇండ్లల్లో చోరీ

నవతెలంగాణ-మునుగోడు

నాలుగు ఇండ్లల్లో దొంగలు చోరీకి పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు , బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రంలో దొంగల ముఠా తాళం వేసి ఉన్న ఇంటి తాళాలను పగలగొట్టి ఇండ్లల్లో ఉన్న బీరువాలలో ఉన్న బంగారం,వెండి,నగదు తో పాటు బైకులు ఎత్తుకెళ్లారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ..మండల కేంద్రానికి చెందిన స్వీట్ హౌస్ వ్యాపారి జిట్టగోని లింగస్వామి ఇంట్లో 12 తులాల బంగారం , 60 వేల నగదు , రావి గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని వడ్డెర గూడానికి చెందిన ముద్దంగుల నరసింహ ఇంట్లో రెండు తులాల బంగారం 2 లక్షల 50 వేల నగదు , రాసమల్ల శ్రీరాములు ఇంటి వద్ద బైకును , వెనిగల పురుషోత్తం ఇంట్లో 60 వేల నగదు, అరకిలో వెండి ని దొంగలించినట్లు బాధితులు గురువారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని సంఘటనా స్థలాన్ని క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ , ఫింగర్ ప్రింట్ ద్వారా ఆధారాలు పరిశీలించారు. కేసును చేదించేందుకు డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు బృందాల ఏర్పడి దొంగల కోసం గాలిస్తున్నారు.

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలి

నవతెలంగాణ-పెద్దవూర



విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సహాయ గిరిజన అభివృద్ధి అధికారి ఏటీడీఓ ఎం .శ్రీనివాస్ అన్నారు. గురువారం పెద్దవూర మండల కేంద్రం లోని గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, హాస్టల్ సిబ్బందికి సం బంధించిన హాజరు పట్టికలు, రికార్డులు, వం టగది, భోజనాలు, మూత్రశాలలు, పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. వార్డెన్లు స్థానికంగా ఉండా లని సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్యూటర్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. అంటువ్యాధులు ప్రభలకుండా వంటగది, హాస్టల్ పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, నీరు నిల్వ ఉండకుండా చూడా లని తెలిపారు. ఆయన ప్రిన్సిపాల్ బాలాజీ నాయక్, హస్టల్ వార్డెన్ కొల్లు బాలకృష్ణ సిబ్బంది ఉన్నారు.

హుజూర్‌నగర్‌కు బైపాస్ రోడ్

- అధికారులతో సమావేశమైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట

హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రానికి బైపాస్ రహదారి ఏర్పాటుకు రంగంసిద్ధమైంది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జాతీయ రహదారుల విభాగానికి చెందిన రోడ్లు భవనాల అధికారి శ్రీధర్ ఇతర అధికారులతో ప్రత్యేకంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. జడ్చర్ల నుండి కోదాడ వరకు జాతీయ రహదారి విస్తరించిన నేపథ్యంలో పెరిగిన ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బైపాస్ రోడ్ నిర్మాణానికి అంకురార్పణ చుట్టారు. ట్రాఫిక్ రద్దీని నియంత్రించడంతో పాటు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు బైపాస్ రోడ్ ఏర్పాటు సరైన మార్గమని భావించిన ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.



అందులో భాగంగానే జాతీయ రహదారుల రోడ్లు,భవనాల శాఖాధి కారులు పలు రకాలుగా రూపొందించిన బైపాస్ రహదారి నమూనాలను ఆయన పరిశీలించారు. అందుకు ఎటువంటి అభ్యంతరాలు తలెత్తకుండా ఉండేందుకు గాను అందుబాటులో ఉన్న ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. ఈ బైపాస్ రహదారి ఏర్పాటుతో మొత్తం హుజుర్నగర్ నియోజకవర్గానికి ప్రయోజనం కలగడంతో పాటు దూరప్రాంతల నుండి వచ్చే వాహనాలు నేరుగా కోదాడ,ఖమ్మం, విజయవాడ లకు నేరుగా వెళ్లేందుకు వేసులు బాటుగా ఉంటుందని సమీక్షలో అయన అభిప్రాయపడ్డారు.నియోజకవర్గ పరిధిలోని గరిడేపల్లి, నెరేడుచర్ల మండలాలకు చెందిన ప్రజలు హుజుర్నగర్ తో నిమిత్తం లేకుండా నేరుగా కోదాడ ఆ పై ప్రాంతాలకు వెళ్లేందుకు వెసులుబాటు కలుగనున్నది. రాయనిగూడెం వద్ద మొదలయ్యే ఈ బైపాస్ రోడ్ నేరుగా మాధవరాయనిగూడెం వద్ద హుజుర్నగర్-కోదాడ రహదారి మార్గం మధ్యలో ఉన్న ఎస్.ఎస్.పి కెనాల్ వద్ద కలుస్తుంది. ఈ ఈ సమీక్షా సమావేశంలో తన్నీర్ మల్లికార్జున్, దొంతగాని శ్రీనివాస్ గౌడ్,కోతి సంపత్ రెడ్డి, సైదులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఐకమత్యంతో పనిచేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మది వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-సూర్యాపేట



కార్మికులంతా ఐకమత్యంతో కలిసి పనిచేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మది వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సీఐటీయూ అనుబంధ సంఘంగా గురువారం స్థానిక కార్యాలయంలో జరిగిన జిల్లా బిల్డింగ్ పెయింటర్స్ అసోసియేషన్ ఎన్నికలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఐటీయూ ఆధ్వర్యంలో 29 రంగాలలో కార్మిక సంఘాలు పనిచేస్తున్నాయని తెలిపారు. నూతనంగా ఎన్నికైన బిల్డింగ్ పెయింటర్స్ అసోసియేషన్ ద్వారా ప్రతి గ్రామంలో, మండలంలో, పట్టణాలలో కమిటీలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అసోసియేషన్ క్రమశిక్షణతో ప్రజాస్వామ్య పద్ధతిలో పనిచేయాలన్నారు. ప్రతి నెల సమావేశాలు ఏర్పాటు చేసుకుని కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. బిల్డింగ్ పెయింటర్స్‌కు ప్రభుత్వం ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని చెప్పారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. ఈ సందర్భంగా జరిగిన జిల్లా బిల్డింగ్ పెయింటర్స్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికలలో జిల్లా అధ్యక్షులుగా కనుకు మార్క్స్, ప్రధాన కార్యదర్శిగా మొండికత్తి లింగయ్య, ఉపాధ్యక్షులుగా శతకోటి వెంకన్న, కోశాధికారిగా కొత్తపల్లి శివకృష్ణ,పెన్‌పహాడ్ మండల అధ్యక్షులు ఎర్పచర్ల అభిరాంలు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా నెమ్మది వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. పెద్దసంఖ్యలో బిల్డింగ్ పెయింటర్స్ ఓటింగ్‌లో పాల్గొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన బిల్డింగ్ పెయింటర్స్ అసోసియేషన్ కు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

గిరిజన ఉన్నత అధికారి పై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-క్లాక్‌టవర్

అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నల్లగొండ జిల్లా గిరిజన గురుకులాలను మార్చిన ఉన్నతాధికారి పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకారపు నరేష్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లా వ్యాప్తంగా గిరిజన గురుకులాలలో అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి ఏజెన్సీ గాని ,జిల్లా కలెక్టర్ పర్మిషన్ లేకుండా కనీసం గిరిజన గురుకుల కార్యదర్శి సమాచారం లేకుండా అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరు మీద అడ్డగోలుగా లక్షలాది రూపాయలు అమ్ముకోవడం జరుగుతుందన్నారు.. దామచర్ల మండలం గిరిజన గురుకుల, పాఠశాల, కళాశాల లో ఇటీవల ల్యాబ్‌అసిస్టెంట్ పోస్టు కలెక్టర్ , ఆర్‌సీఓ,అక్కడి ప్రిన్సిపాల్ కు ఇలాంటి సమాచారం ఇవ్వకుండా పోస్టు ఇచ్చారన్నారు. ఈ పాఠశాలలో కళాశాల అప్ గ్రేడ్ అయి సుమారు నాలుగేండ్లు అవుతున్నా ఇప్పటివరకు కళాశాల జీవో లేదన్నారు. కానీ ప్రభుత్వ అనుమతి జీవొనే లేకుండా పత్రిక ప్రకటనలు లేకుండా శాంక్షన్ పోస్టు లేకుండా ఏ విధంగా ఉద్యోగం కల్పించారు. ఉన్నత స్థాయి అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.అదే స్కూల్ లో గత 4నెలలు గా పనిచేస్తున్న ఏఎన్ఎంకు ఇప్పటివరకు జీతం లేదన్నారు. అదేవిధంగా ఇదే పాఠశాలలో ముగ్గురు అవుట్‌సోర్సిర్సింగ్ ఉద్యోగులను వర్కర్ గా నియమించారన్నారు. ఇటీవల కాలంలో అవంతిపురం గురుకుల పాఠశాలలో అటెండర్ పోస్ట్ కూడా నింపారన్నారు.. గిరిజనగురుకులాల సొసైటీని రోడ్డుపాలు చేసిన రాష్ట్రస్థాయి ఉన్నతాధికారిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు పూనుకుంటామని హెచ్చరించారు. నవదీప్, కిరణ్ స్పందన ,సిరి, కోటేష్,సంపత్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండటౌన్ : జిల్లాలోని గురుకుల పాఠశాలలో ఔట్సోర్సింగ్ ఉద్యోగాల విషయంలో జిల్లా కలెక్టర్‌గాని, ఆర్ సి ఓ గారికి పాఠశాలల ప్రిన్సిపల్ లకు గాని ఎలాంటి సమాచారం లేకుండా నిబంధనలకు విరుద్ధంగా అవుట్సోర్సింగ్ ఉద్యోగాలు ఇచ్చినటువంటి గిరిజన ఉన్నత అధికారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బుడగ వెంకటేష్ కోరారు. గురువారం పట్టణంలో నిర్వహించిన ఆ సంఘం మండల కమిటీ సమావేశంలో ఎఆయన మాట్లాడారు. గిరిజన గురుకుల కార్యదర్శి జిల్లా కలెక్టర్ పర్మిషన్ లేకుండా కనీసం గురుకుల కార్యదర్శి సమాచారం లేకుండా జిల్లాలో అవుట్సోర్సింగ్ ఉద్యోగాలు విషయంలో అడ్డగోలుగా డబ్బులు తీసుకొని ఉద్యోగాలను అమ్ముకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మనోజ్, యశ్వంత్, ఆంజనేయులు, చరణ్, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ : నిబంధనలకు విరుద్ధంగా గిరిజన గురుకులాలలో లక్షలాది రూపాయలకు ఔట్సోర్సింగ్ ఉద్యోగాలను అమ్ముకున్న గిరిజన ఉన్నతాధికారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి మూసుకు రవీందర్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని నర్ర రాఘవరెడ్డి భవనంలో ఆ సంఘం డివిజన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఆ సంఘం ప్రతినిధులు శ్రీకాంత్ , రాము, విజయ్, వినయ్ , సంపత్ పాల్గొన్నారు.

డిండి ప్రాజెక్టు డీపీఆర్‌ను ఆమోదించడం సీపీఐ(ఎం) స్వాగతిస్తుంది

- రైతాంగం పట్ల కేంద్రం విధానాలు మార్చుకోవాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం

నవతెలంగాణ-మునుగోడు



ఎన్నో సంవత్సరాల సీపీఐ(ఎం) పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం డిండి ప్రాజెక్టుకు డీపీఆర్ ను ప్రకటించడం స్వాగతిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం హర్షం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ(ఎం) పోరాట ఫలితంగా ప్రజలకు ఎన్నో రకాల ఉప యోగాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వ్యవసాయ కూలీలకు 12 వేలు , రైతు భరోసా ప్రకటించడం సీపీఐ(ఎం) ఒత్తిడి ఫలితంగానే ఆమోదం తెలిపిందని తెలిపారు. సీపీఐ(ఎం) ప్రజల తరపున చేసిన పోరాటాలు ఏవి వృథా కాలేదని అన్నారు. ప్రజా సమస్యల పైన నికరంగా పోరాడే పార్టీని బలపరచాలని, ప్రజల హక్కుల కోసం, ప్రజలంతా ఐక్యంగా నిలబడాలని కోరారు . రైతాంగం పట్ల కేంద్ర ప్రభుత్వ విధానాలు మార్చుకోవాలని, లేదంటే ప్రతిఘటన తప్పదని అన్నారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తెచ్చిన మోడీ ప్రభుత్వంరైతుల పోరాటంలోవెనక్కి తగ్గిన చాప కింద నీరులా మళ్లీ అమలు చేయడానికి పూనుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి సాగర్ల మల్లేష్, మండల కమిటీ సభ్యులు యాస రాణి శ్రీను, వరికుప్పల ముత్యాలు, వడ్లమూడి హనుమయ్య, వేముల లింగస్వామి , కొంక రాజయ్య, కట్ట లింగస్వామి, పగడాల కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సేవలు, పనితీరు పర్యవేక్షణకు క్యూ ఆర్ కోడ్

- పోలీసు పనితీరును ప్రజలు ఆన్లైన్ నందు తెలుపవచ్చు
- ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

నవతెలంగాణ-సూర్యాపేట



పోలీసులు అందిస్తున్న సేవలపై ప్రజలు వారి అభిప్రాయం తెలియజేయడానికి రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర పోలీసు శాఖ క్యూఆర్ కోడ్ ను అందుబాటులోకి తెచ్చినదని జిల్లా ఎస్పి సన్ ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో క్యూఆర్ కోడ్ పోస్టర్ ను ఆయన అవిష్కరించి మాట్లాడారు. ఈ క్యూఆర్ ఇంటర్నెట్ మధ్యమాల ద్వారా స్కాన్ చేసి వివరాలు నమోదు చేయవచ్చని చెప్పారు. సిటిజన్ ఫీడ్బ్యాక్ ను తెలియ జేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా సిటిజన్ ఫీడ్బ్యాక్ క్యూఆర్ కోడ్ ను ప్రారంభించినట్టు తెలిపారు. గతంలో పోలీసుల సేవలపై పిర్యాదుదారులకు ఫోన్ చేసి అభిప్రాయాలు సేకరించేవారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేసి పిటిషన్, ఎఫ్ఐఆర్, ఈ చలాన్, పాస్పోర్ట్ ధ్రువీకరణ, ఇతర అంశాలపై, పోలీసు అధికారుల ప్రతిస్పందన, ప్రవర్తన వారి అభిప్రాయాలను నమోదు చేయవచ్చని వివరించారు.ఈ విధానం పోలీసు సిబ్బందిలో బాధ్యత పారదర్శకతను పెంచుతుందన్నారు. ఈ కార్య క్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, డి.సి.ఆర్.బి డీఎస్పీ మట్టయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నాగభూషణం, సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్, ఐటీ కోర్ ఆర్ ఎస్ ఐ రాజశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

'రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత'

నవతెలంగాణ-కోదాడటౌన్



ఈనెల 23న ది కోదాడ లారీ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించనున్న జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల కార్యక్రమాన్ని రవాణా రంగంలో పనిచేసే డ్రైవర్లు, ఓనర్లతోపాటు ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కోదాడ మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ షేక్ జిలాని తెలిపారు. గురువారం లారీ అసోసియేషన్ కార్యాలయంలో కార్యక్రమం విజయవంతానికి లారీ యజమానులతో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. అవగాహన సదస్సుకు కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, జిల్లా కలెక్టర్, ఎస్పీ, రవాణా శాఖ అధికారులు పాల్గొంటున్నారని రవాణా రంగంలో పనిచేసే వారితోపాటు ప్రజలందరూ ఇట్టి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోదాడ అసోసియేషన్ అధ్యక్షులు తూణం కృష్ణ, ప్రధాన కార్యదర్శి యలమందల నరసయ్య ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షులు పైడిమర్రి వెంకటనారాయణ, ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల రామారావు, కోశాధికారి బాబు, జాయింట్ సెక్రటరీ కోటేశ్వరరావు, పెద్ది అంజయ్య, ఓరుగంటి ప్రభాకర్, వెంకట్ రెడ్డి, విలాస కవి నరసరాజు, లింగయ్య, దొంగరి సుధాకర్, జగన్, కొల్లు ప్రసాద్, రెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులందరికీ రూ.12 వేలివ్వాలి

- వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు

నవతెలంగాణ-హుజూర్‌నగర్



భూమిలేని వ్యవసాయ కార్మికులందరికీ రూ.12 వేలు వెంటనే విడుదల చేయాలని, అందుకు అన్ని సంఘాలు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు పిలుపునిచ్చారు. గురువారం హుజూర్‌నగర్ పట్టణంలోని అమరవీరుల స్మారక భవన్‌లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం హుజూర్‌నగర్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో "వ్యవసాయ కార్మికులు-పాలకుల వాగ్దానాలు-సంక్షేమ పథకాల అమలు" అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ జాబ్ కార్డు ద్వారా 100 రోజులు పని పూర్తిచేసిన కుటుంబాల ఆధార కార్డు, పట్టాదారు పాస్ బుక్ ఆధారంగా రూ.12 వేల పథకానికి ఎంపిక చేయబోతున్నట్టుగా వార్తలొస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం విధివిధానాలు ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. గ్రామ సభల ద్వారానే లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోసనబోయిన హుస్సేన్ అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికేయంయు) జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ్ల ధనుంజయ నాయుడు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎం.రాంబాబు, తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దుగ్గి బ్రహ్మం, ఐద్వా జిల్లా నాయకురాలు ఇంద్రియాల త్రివేణి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికేయంయు) రావుల సత్యం, జడ వెంకన్న, తెలంగాణ రైతు సంఘం పట్టణ కార్యదర్శి పాశం వీరబాబు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దోసపాటి బిక్షం, గుండు సైదులు, జిఎంపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పాశం వెంకట్ నారాయణ, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి మీసాల వీరబాబు, రచయితల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి, ఐలు జిల్లా నాయకులు పిన్నపురెడ్డి వెంకటరెడ్డి, నాయకులు చిన్నం వీరమల్లు, సూర్యనారాయణ, వెంకన్న పాల్గొన్నారు.

ఎంపీటీసీ, వార్డుల సంఖ్యను పెంచాలి

- అదనపు కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-బీబీనగర్



మండలంలోని కొండ మడుగు మేజర్ గ్రామంలో పెరిగిన జనాభా, అలాగే ఓట్లను పరిగిణలోకి తీసుకొని పరి పాలన సౌలభ్యం కోసం రెండు ఎంపీటీసీ స్థానాలు ఏర్పాటు చేయాలని అలాగే పంచాయతీ వార్డుల సంఖ్యను పెంచాలని కోరుతూ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్‌కు గ్రామానికి చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కడియం చంద్రశేఖర్ మాజీ ఉపసర్పంచ్ కనకబోయిన గోపాల్, వార్డు సభ్యులు కనకబోయిన రాజ మల్లేష్, చిన్నగల్ల అశోక్, బి ఆర్ ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చింతల సుదర్శన్ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో పేదలకొరిగిందేమీ లేదు

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి యాకూబ్

నవతెలంగాణ-గరిడేపల్లి

కాంగ్రెస్ ఏడాది పాలనలో పేద ప్రజలకు ఒరిగింది ఏమి లేదని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి యాకూబ్ అన్నారు. గురువారం సీపీఐ(ఎం) జనరల్ బాడీ సమావేశం మండల పరిధిలోని కోనాయిగూడెం గ్రామంలో దోసపాటి సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లడుతూ బీఆర్‌యస్‌పై విసుగు చెందిన ప్రజలు కాంగ్రెస్ హామీలు నమ్మి అధికారాన్ని కట్టబెట్టారన్నారు. కానీ హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వెంటనే ఆరు గ్యారెంటీల్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తుమ్మల సైదయ్య జిల్లా కమిటీ సభ్యులు దుర్గి బ్రహ్మం మాజీ సర్పంచ్ ఎమగాని వెంకటేశ్వర్లు మండల కమిటీ నాయకులు బోయిళ్ళ అర్జున్ దోసపాటి భిక్షం మండవ సైదులు యనాల సోమయ్య మాజీ ఎంపీటీసీ సుశీల బి శ్రీనివాస్ సైదిరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షునిగా మధుకర్ రెడ్డి

నవతెలంగాణ-రామన్నపేట

బీజేపీ రామన్నపేట మండల అధ్యక్షునిగా మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన నాయకులు బండ మధుకర్ రెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మధుకర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని, స్థానిక సమస్యలపై నిరంతరం అందరి సహకారంతో పోరాటం నిర్వహిస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మండల వెంకన్న, జిల్లా కార్యదర్శి శివకృష్ణలకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

జీపీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి

గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పోచంపల్లి ఎంపీడీవోకి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు మంచాల మధు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా గ్రామ పంచాయతీలలో 6 నెలలు, 4 నెలలు, 3 నెలల వరకు వేతనాలు పెండింగ్లో ఉన్నాయన్నారు. ఇప్పటికే మల్టీ పర్పస్ పేరు విధానంతో కార్మికులతో రూ.8,500 ఇచ్చి పరిశ్రమను ప్రభుత్వం దోచుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలను చెల్లించి వారికి కనీస వేతనాలతో పాటు ఈఎస్ఐ పిఎఫ్ సౌకర్యాలను కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీరితో పాటు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు బాబు స్వామి శంకర్ సలీం జయమ్మ శారద స్వామి పాల్గొన్నారు.



నిదాన్‌పల్లి చెరువు మట్టిలూటి

- చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్న అధికారులు

నవతెలంగాణ-రామన్నపేట

ఒకప్పుడు విలువ లేకుండా ఉండే మట్టి నేడు బంగారంగా మారింది. ఇదే అదునుగా బావించిన అక్రమార్కులు ఎలాంటి నిబంధనలు, అనుమతులు లేకుండా చెరువుల్లో, కుంటల్లో మట్టిని అడ్డగోలుగా జెసిబి యంత్రాలతో తొవ్వుతూ ట్రాక్టర్లతో తరలిస్తూ అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని నిదాన్ పల్లి గ్రామ చెరువు నుండి మట్టిని యథేచ్ఛగా అక్రమార్కులు లూటీ చేస్తూనే ఉన్నారు. చెరువులో అడ్డగోలుగా 20, 25 ఫీట్ల లోతు వరకు జేసీబీలతో త్రవ్వి మట్టిని తరలిస్తూ అమ్ముకుంటున్నారు. ఇప్పటికే చెరువులో అనేకచోట్ల ప్రమాదకర స్థాయిలో మట్టిని తొవ్వేసుకుని పెద్దపెద్ద గుంతలు చేశారు. చెరువు కట్టకు సమీపంలోనే లోతుగా గుంతలు తవ్వి ఉండడంతో ఏ సమయంలోనైనా కట్టకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులను, కుంటలను ఆక్రమిస్తే పట్టించుకోరు. అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే పట్టించుకోరు మరి అధికారులు ఏం చేస్తున్నట్లు అని ప్రజలు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. అధికారులు సత్వరమే స్పందించి చెరువుల్లో, కుంటల్లో అడ్డగోలుగా అనుమతులు లేకుండా మట్టిని తవ్వే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందజేత

నవతెలంగాణ-తిరుమలగిరి సాగర్



బుసిరెడ్డి పాండురంగా రెడ్డి ఫౌండేషన్ సహాయంతో నాయకునితండా క్రికెట్ క్రీడాకారులకు మాజీ వైఎస్ ఎంపీపీ యడవెల్లి దీలిప్ రెడ్డి చేతుల మీదగా క్రికెట్ కిట్టు గురువారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని, ఎలాంటి చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా సన్మార్గంలో నడవాలని అన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొంతుందని, క్రీడాకారుల మధ్య స్నేహ భావం కల్గుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు మేరావత్ మునినాయక్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి హరి నాయక్,క్రీడాకారులు తులసీరాం, మోతిలాల్, రాగ్య దత్తా, రాజేష్, బాబు, రంగా పాల్గొన్నారు.

యువతలో క్రీడా స్ఫూర్తిని నింపడం అభినందనీయం

- కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు

నవతెలంగాణ-కోదాడటౌన్



క్రీడాకారులను ప్రోత్సహిస్తూ యువతలో క్రీడాస్ఫూర్తిని నింపేందుకు కత్రం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించడం అభినందనీయమని కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, పీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, గ్రంథాలయ చైర్మెన్ వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్మెన్ సామినేని ప్రమీలలు అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని కటకమ్మ గూడెం బైపాస్ రోడ్డులో గల మైదానంలో కత్రం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కత్రం ప్రీమియర్ లీగ్ 3 పోటీలను డీఎస్పీ శ్రీధర్ రెడ్డి, ట్రస్ట్ అధ్యక్షులు కత్రం శ్రీకాంత్ రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. గత 3 దేండ్లు శ్రీకాంత్‌రెడ్డి తన సొంత ఖర్చులతో కోదాడ నియోజకవర్గంలో క్రీడా రంగాన్ని ప్రోత్సహిస్తున్నందుకు గాను వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చెర్మెన్ కందుల కోటేశ్వరరావు, కత్రం కిరణ్ కుమార్ రెడ్డి, ముడియాల సత్యనారాయణ రెడ్డి, వేనేపల్లి నరేష్ రావు, ముడియాల బాబి, మాజీ సర్పంచ్ పారా సీతయ్య, ఎర్నేని బాబు, పైడిమర్రి సత్తిబాబు, ఉమా శ్రీనివాసరెడ్డి, బాల్ రెడ్డి,ఓరుగంటి శ్రీనివాస్ రెడ్డి, దేగ శ్రీధర్, ముత్తవరపు రామారావు, ఈదుల కృష్ణయ్య, పట్టాభి రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అన్ని రంగాల్లోనూ మహిళలు ముందుండాలి

- ఎస్ఐ సతీష్ రెడ్డి

నవతెలంగాణ-హాలియా



అన్ని రంగాల్లోనూ మహిళలు ముందుండాలని మహిళలు సమాజంలో సగభాగమని వారి చైతన్యం తోటే సమాజ అభివృద్ధి జరుగుతుందని అన్నారు. పట్టణకేంద్రంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీ బహుమతి ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడుతూ ఇలాంటి రంగవల్లి పోటీలలో మహిళలను నైపుణ్యాన్ని కనబరిచే ఈ పోటీలు ఉత్సాహపూరిత వాతావరణం లో జరుగుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. మొదటి బహుమతి గాయత్రికి 5016 ప్రైజ్ మనీని ఎస్ఐ చేతులమీదుగా అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అవతా సైదులు మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాలలో రాణించాలన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న ఆకృత్యాలను ఎండగట్టేందుకు ప్రతి మహిళా ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో బస్సు సతీష్ నోముల మహేష్ రేవెల్లి వెంకటేశ్వర్లు హుస్సేన్ శంకర్ బచ్చు వెంకన్న లింగయ్య మహేష్ శివయ్య రంగయ్య పాపయ్య పాల్గొన్నారు.



ఆత్మస్థైర్యం నింపడానికి క్రీడలు దోహదం

నవతెలంగాణ-చండూరు

విద్యార్థులకు ఆత్మస్థైర్యాన్నింపడానికి క్రీడలు చాలా ఉపయోగపడతాయని గట్టుపల్ ఎంఈఓ అమృతా దేవి అన్నారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా స్థానిక గట్టుపల్ హైస్కూల్లో క్రీడలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులు భావన, చందన, వర్షిత, పావని , శ్రీవిద్య, అక్షయ్, తులసి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యతను వెలికితీయడానికి డీవైఎఫ్ఐ మంచి ప్రయత్నం చేస్తుందని కొనియాడారు. అనంతరం డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి, డ్రగ్స్, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, విద్యార్థులు చెడు మార్గంలో కాకుండా మంచి మార్గంలో నడిచి సమాజం మార్పునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల కన్వీనర్ పసుపుల ఏడుకొండలు, మాజీ డివిజన్ నాయకులు కర్నాటి సుధాకర్, కర్ణాటక వెంకటేశం, పసుపుల నవీన్, జతిన్, సురేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాదేవ్ జిమ్ అండ్ ఫిట్నెస్ సెంటర్ ప్రారంభం

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



పట్టణంలోని అమ్మనబోలు రోడ్డులో ఏర్పాటు చేసిన మహాదేవ్ జిమ్ అండ్ ఫిట్నెస్ సెంటర్ ను గురువారం ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ఆరోగ్యకరమైన శరీరంలో ఆరోగ్యకరమైన మనసు నివాసం ఉంటుందని, నేటి యువత ఉరుకులు పరుగుల జీవితంలో శారీరక, మానసిక ఒత్తిడి నుండి దూరంగా ఆరోగ్యకరమైన జీవితానికి వ్యాయామం ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు, బత్తుల ఉషయ్య, దూదిమెట్ల సత్తయ్య, జేరిపోతుల భరత్, దూదిమెట్ల స్రవంతి, సంస్థ నిర్వాహకులు రాము, సాయి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల కొరతతో మధ్యలోనే ఆగిన నిర్మాణాలు

- హుజూర్నగర్ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాల భవన నిర్మాణం
- పెండింగ్‌లో సుమారు రూ.80 కోట్ల వరకు బిల్లులు

నవతెలంగాణ-హుజూర్‌నగర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద తాత్కాలిక మరమ్మతులకు 1992 బడులను ఎంపిక చేసింది. వీటిలో విద్యుత్ సౌకర్యం, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల స్లాబ్ మరమ్మతులు తదితర 3000 పైగా పనులు అనుమతులను ఇచ్చింది. ఈ పనుల కోసం రూ.50 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేయగా ఈ పనులు ఎక్కడికక్కడ మహిళా సంఘాలు అమ్మ ఆదర్శ కమిటీలతో చేయించాలని నిర్ణయించారు. అవేవీ అమలుకు నోచుకోలేదు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకంతో చేపట్టిన పాఠశాలల పనులను పాఠశాలలో ప్రారంభించే లోగా జూన్ నెలలోనే పూర్తి చేయాల్సి ఉండగా నేటికీ పూర్తిగాలేదు. మనఊరు మనబడి, అమ్మ ఆదర్శ పాఠశాల నిర్మాణం త్వరతగతిన పూర్తి చేసి గ్రామీణ ప్రాంతాలలోనూ పట్టణ ప్రాంతాలలోనూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు భవన నిర్మాణాల వసతి చేకూర్చాల్సి ఉండగా నిధుల కొరతతో ఎక్కడికక్కడ సగంలోనే నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్న విద్యాశాఖ ఆ నిర్మాణాల పనులకు బిల్లును మంజూరు చేయకపోవడంతో ఒక్క అడుగు కూడా ముందుకు వేయడం లేదు. సగం వరకు పనులు చేసిన కాంట్రాక్టర్లు తమకు బిల్లులు రాకపోవడంతో సగంలోనే వదిలేసి నిర్మాణపు పనులకు దూరంగా ఉంటూ తాము చేసిన పనుల బిల్లుల కోసం పంచాయతీరాజ్ శాఖ విద్యాశాఖ చుట్టూ తిరుగుతున్నారు. అయినా నేటికీ ఆ బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను అసంపూర్తిగా వదిలేశారు.



ఉమ్మడి జిల్లాలో 1097 బడులను మన ఊరు మన బడి పథకం కింద ఎంపిక చేసి వీటిలో వివిధ పనులను ప్రతిపాదించారు. ఈ పనుల పూర్తికి 330 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. అయితే సుమారు 80శాతం పాఠశాలలో పనులు 40 శాతానికి మించి పూర్తికాలేదు. సుమారు రూ.80 కోట్ల వరకు బిల్లులు పెండింగ్లో ఉన్నట్లు సమాచారం. పథకం అమలు సమయంలో ఒక్కొక్క జిల్లాకు రెండు కోట్ల చొప్పున ఆయా జిల్లాల కలెక్టర్ల ఖాతాలో ప్రభుత్వం నిధులను జమ చేసింది. పనులను రెండు విభాగాల్లో చేపట్టగా రూ.30 లక్షలలోపు అయితే ఆయా పాఠశాలల అభివృద్ధి కమిటీల తీర్మానం మేరకు పనుల విలువ రూ.30 లక్షలు దాటితే టెండర్ల ద్వారా చేపట్టాలని నిర్ణయించింది. చాలా పాఠశాలల్లో పనులు రూ.30 లక్షల లోపు ఉన్న వాటినే చేపట్టారు. రెండేళ్లలో ఉమ్మడి జిల్లాలో సుమారు 320 పాఠశాలల్లో పనులను పూర్తి చేసినట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తుంది. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులకు ఈ పథకంలో ఎంపిక చేసిన వాటికి కాకుండా వేరే బడులను ఎంపిక చేశారు. ఇప్పుడు పాతవి అసంపూర్తిగా మిగిలి కొత్తగా చేపట్టినవి పూర్తి కాకపోవటంతో విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. బిల్లుల జాప్యం అవుతుండటం తోనే పనులు ఆగిపోతున్నాయి.

నల్లగొండ జిల్లాలో మొత్తం బడులు 1,994 ఉండగా మన ఊరు మనబడి పథకంలో ఎంపిక చేసిన బడులు 517, అమ్మ ఆదర్శ పథకం కింద ఎంపిక చేసిన బడులు 937. సూర్యాపేట జిల్లాలో మొత్తం 1,239 పాఠశాలలు ఉండగా మన ఊరు మనబడి పథకం కింద ఎంపిక చేసిన పాఠశాలలు 329 అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద ఎంపిక చేసిన బడులు 536. యాదాద్రి జిల్లాలో మొత్తం 901 పాఠశాలలు ఉండగా మన ఊరు మన బడి పథకం కింద251, అమ్మ ఆదర్శ పథకం కింద ఎంపిక చేసిన పాఠశాలలు 519 ఉన్నాయి.

ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నిధులను సకాలంలో వెచ్చించి వచ్చే విద్యా సంవత్సరం జూన్ వరకైనా ఈ పాఠశాలలు అన్ని సంపూర్ణంగా పూర్తయ్యేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రభుత్వం నిధులు విడుదలను మధ్యలోనే ఆపివేయడం వల్ల తనలో అస్తవ్యస్తంగా తయారై గుత్తేదారులపై అధిక భారం పడి నిర్మాణ పనుల వ్యయం పెరిగి వదిలిపెట్టే అవకాశం కూడా ఉంది ప్రభుత్వం ఈ బడుల నిర్మాణాలపై పర్యవేక్షణ కమిటీని వేసి నిధులు సకాలంలో మంజూరు చేసి పనులు పూర్తయ్యేలా చూడాలి.

భూమిలేని వ్యవసాయ కార్మికులందరికీ రూ.12 వేలివ్వాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కొండమడుగు నర్సింహా

నవతెలంగాణ-చౌటుప్పల్



భూమిలేని వ్యవసాయ కార్మికులందరికీ సంవత్సరానికి రూ.12వేలు ఉపాధి హామీ జాబ్ కార్డుకు సంబంధం లేకుండా ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కొండమడుగు నర్సింహా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణకేంద్రంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో ఆ సంఘం మండలకమిటీ సమావేశం మండల అధ్యక్షులు గంగదేవి సైదులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఉపాధిహామీ జాబ్ కార్డు ద్వారా 100 రోజులు పనిచేసిన కుటుంబానికి 12వేల రూపాయల స్కీమ్‌కు ఎంపిక చేయబోతున్నట్టు వార్తలపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కోరారు. లబ్ధిదారులను గ్రామసభల ద్వారా అర్హత ఉన్న జాబ్‌కార్డుదారులతోపాటు వలస కార్మికులు, కూలి పని చేసుకొని బతికే పేదలందరిని అర్హులుగా ఎంపికచేయాలని సూచించారు. జాబ్‌కార్డు ఆధారంగా లబ్ధిదారులను గుర్తిస్తామంటే చాలామందికి వివిధ కారణాలతో జాబ్‌కార్డు లేని పరిస్థితి ఉందన్నారు. దాని ఆధారంగా లబ్ధిదారులను ఎంపికచేయడమనేది సరైంది కాదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పష్టి చెప్పి గ్రామాల్లో సభలు నిర్వహించి భూమిలేని ప్రతి కూలి, పేదలను ఈ స్కీమ్‌కు ఎంపికచేయాలని డిమాండ్‌చేశారు. గ్రామీణ ఉపాధిహామీ పథకం కోసం పనిచేస్తున్న వ్యవసాయ కార్మికసంఘాలు, దళిత, గిరిజన, మహిళా, ఎన్‌జీఓ వంటి సంఘాలతో ఉమ్మడి సమావేశం ప్రభుత్వం నిర్వహించి, అభిప్రాయాలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. గతంలో ప్రభుత్వం పేదలకు గుట్టలు, చెట్లు, పుట్టలు ఒక్కొక్కరికి ఎకరం, అర ఎకరం భూమి ఇచ్చిందని, వారందరికి కూడా రూ.12వేల స్కీమ్‌ను అమలుచేయాలని డిమాండ్‌చేశారు. 5,10 గుంటల భూమి ఉన్న వారికి కూడా ఇవ్వాలన్నారు. వివిధ కారణాలు చూపి భూమిలేని పేదలకు ఈ స్కీమ్‌ను అందకుండా చేస్తే వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా సహాయకార్యదర్శి గుంటోజు శ్రీనివాస్‌చారి, మండల కార్యదర్శి బొజ్జ బాలయ్య, జిల్లాకమిటీ సభ్యులు బోయ యాదయ్య, మండలకమిటీ సభ్యులు మీసాల శ్రీను, యాట ముత్యాలు, బాలరాజు పాల్గొన్నారు.

నూతన ఏసు బెరాక ప్రార్థన మందిరం ప్రతిష్టాపన

- పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



నవతెలంగాణ-రాజాపేట

మండల కేంద్రంలోని అంబెడ్కర్ కాలనిలో నూతన బేరాక ఏసు మందిర ప్రతిష్ట కార్యక్రమంలో గురువారం లితెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేసి నూతన ఏసు మందిరానికి ప్రతిష్ట చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ,క్రిస్టియన్ సోదరీ సోదరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల కరపత్రం విడుదల

నవతెలంగాణ-కోదాడటౌన్



ఈ నెల 25 నుండి 28 వరకు సంగారెడ్డి పట్టణంలో నిర్వహించనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలలను సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బెల్లకొండ సత్యనారాయణ విడుదల చేసి మాట్లాడారు. ఉద్యమాల దిక్సూచి పోరాటాల సారథి కష్టజీవుల గొంతుక సీపీఐ(ఎం) ఒక్కటే అన్నారు. కాబట్టి తెలంగాణ ఏర్పాటు శతాబ్ద కాలం గడిచిన ప్రజల సమస్యలు మాత్రం తీరడం లేదు అని ఆయన అన్నారు. కేంద్రంలో అంబానీ ఆదానీల సర్కారుగా మోడీ సర్కార్ మారిందని ఆయన అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పోరేట్లకు దోచిపెడుతుందని అవినీతి శాస్రిత పాక్షపత్రంతో దేశాన్ని పాలకులు గమనిస్తున్నారని దీంతో పేదలకు పేదల్లోనే కాకుండా మధ్యతరగతి ఉద్యోగులు కూడా ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్రంలో కేంద్రంలో ప్రజలకు అండగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మాజీ వైస్ ఎంపీపీ కోరుట్ల శ్రీనివాస్, బొడ్డు వెంకటనారాయణ, శాఖా కార్యదర్శులు ముసుకు వీరస్వామి, బొడ్డు సత్యనారాయణ, కాసాని రాంబాబు, బొడ్డు లచ్చయ్య, కాసాని చిట్టేలు, కాసాని సోమయ్య పాల్గొన్నారు.

పాత బాకీ కోసం కత్తులతో దాడి

నవతెలంగాణ-నకిరేకల్

పాత బాకీ విషయంలో ఘర్షణ మొదలై కత్తులతో దాడి చేసుకున్న ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..సూర్యాపేటకు చెందిన సంజయ్ భార్గవ్, నకిరేకల్ కు చెందిన ప్రేమ్‌కుమార్‌లు చేపల వ్యాపారం చేస్తున్నారు. నకిరేకల్‌కు చెందిన నాగ స్వామికి ప్రేమ్‌కుమార్ రూ .11 వేలు ఇవ్వాల్సి ఉంది. ఆ విషయంలో గురువారం సాయంత్రం నకిరేకల్ బైపాస్ వద్ద ప్రేమ్ కుమార్, నాగ స్వామికి మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో నాగ స్వామి తో పాటు క్రాంతి, వెంకన్న, అజయ్, ఉదయ్ లు కలిసి సంజయ్ భార్గవ్, ప్రేమ్ కుమార్‌ల పై కత్తులతో దాడి చేయగా వారిరువురికి గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని నకిరేకల్ సీఐ రాజశేఖర్ సందర్శించారు. చికిత్స నిమిత్తం వారిని నల్గొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రెడ్డి సంక్షేమ సంఘం సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి

- ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి

నవతెలంగాణ-మిర్యాలగూడ



సమాజంలో నిరుపేదలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని ఎంపీ కొందరు రఘువీర్ రెడ్డి అన్నారు. గురువారం మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే భక్తుల లక్ష్మారెడ్డి తో కలిసి రెడ్డి సంక్షేమ సంఘం క్యాలెండర్ ను ఆవిష్కరించారు ముందుగా సంఘం ఆధ్వర్యంలో ఎంపీ ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిర్యాలగూడ రెడ్డి సంక్షేమ సంఘం గత ఏడేళ్లుగా ఎంతోమంది పేదలకు అండగా నిలుస్తుందని పేద విద్యార్థులకు స్కాలర్షిప్ల అందించి వారి అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్నారని ముమ్ముందు కూడా సేవా కార్యక్రమాలను విస్తృతం చేసి పేదలకు అండగా నిలవాలని సూచించారు సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు కంచర్ల అనంతరెడ్డి, అనుముల మధుసూదన్ రెడ్డి, శాగా జలంధర్ రెడ్డి, వంగాల నిరంజన్ రెడ్డి , గంట సంతోష్ రెడ్డి,పాప చెన్నారెడ్డి, మన్నెం బుచ్చిరెడ్డి ,ఉపేందర్ రెడ్డి ,నరసింహారెడ్డి, ఇంద్రసేనారెడ్డి,నరేందర్ రెడ్డి ,వెంకట్ రెడ్డి, విజయేందర్ రెడ్డి , యాదగిరి రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ కార్గో హమాలీలకు కూలి రేట్లు పెంచాలి : సీఐటీయూ

నవతెలంగాణ-క్లాక్‌టవర్



తెలంగాణ ఆర్టీసీ కార్గోలో ఎగుమతి, దిగుమతులు నిర్వహిస్తున్న హమాలీలకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నల్గొండ ఆర్టీసీ బస్సు డిపోలో కార్గో హమాలీలకు యూనియన్ సభ్యత్వం అందజేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 92 బస్సు డిపోలలో సుమారు 4000 మంది కార్గో లో ఎగుమతి ,దిగుమతి పనులు అతి తక్కువ రేట్లకు పనిచేస్తున్నారన్నారు. పార్సెల్ సర్వీస్ ఏజెన్ పేరుతో గతంలో ఇస్తున్న కూలి రేట్లు కూడా తగ్గించారని ఆరోపించారు. అనేక సంవత్సరాలుగా చాలీచాలని కూలిరేట్లతో జీవనం జరుపుకుంటున్న హమాలీలకు పీఎఫ్ ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కార్మికుల కుటుంబాలకు ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పించాలని బస్టాండ్లలో విశ్రాంతి గది కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ కార్యదర్శి కొంక అంజయ్య, కోశాధికారి నీలం నరసింహ, సభ్యులు కట్ట నరసింహ ,మల్లేష్, పులకరం మల్లికార్జున్, కొంక అశోక్, జోగు శంకర్ ,చాపల శీను, నరసింహ, కట్ట నాగయ్య, కొంక భిక్షం, శంకరయ్య పాల్గొన్నారు.

సాగర్‌లో పూర్తిస్థాయిలోవిద్యుత్ ఉత్పత్తి

- జెన్కో సీఈ మంగేష్ కుమార్

నవతెలంగాణ-నాగార్జునసాగర్

నాగార్జునసాగర్ పరిధిలోని ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో పూర్తిస్థాయిలో విద్యుత్పత్తిని చేపడుతున్నామని సాగర్ జెన్కో చీఫ్ ఇంజనీర్ మంగేష్ కుమార్ తెలిపారు. నాగార్జునసాగర్ ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలోని 8 యూనిట్లలో రెండవ యూనిట్ మరమ్మతులకు గురికాగా గత సంవత్సర కాలంగా విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. మరమ్మతులకు గురైన టర్బన్ జపాన్ దేశపు సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకున్నది అవడంతో ఆ టర్బన్ ను వినియోగంలోకి తేవడం జెన్కో ఇంజనీర్లకు కుదరకపోవడంతో జపాన్ దేశం నుండి సాంకేతిక పరికరాలు, సాంకేతిక నిపుణులను తీసుకువచ్చి మరమ్మతులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా జెన్కో సి ఇ మంగేష్ కుమార్ మాట్లాడుతూ రూ.30 లక్షల వ్యయంతో 45 రోజులలో మరమ్మతులకు గురైన టర్బన్ కు పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలా చేసామన్నారు. ప్రస్తుతం నాగార్జునసాగర్‌లోని ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తిని చేపట్టుతున్నామని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో తమకు ఇచ్చినటు వంటి టార్గెట్‌ను మించి విద్యుత్‌ఉత్పత్తిని చేపట్టినట్లుగా తెలిపారు.

కాంతారెడ్డి వ్యక్తి కాదు శక్తి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు

నవతెలంగాణ-కోదాడరూరల్



కమ్యూనిస్టు ఉద్యమంలో అలుపెరుగని పోరాట యోధుడుగా ప్రజల మన్నలను పొందిన కామ్రేడ్ ఉప్పల కాంతారెడ్డి వ్యక్తి కాదు ఒక శక్తి అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు కొనియాడారు. గురువారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి మిట్టగడపల ముత్యాల అధ్యక్షతన జరిగిన ఉప్పుల కాంతారెడ్డి ద్వితీయ వర్ధంతి సభకు ములకలపల్లి రాములు హాజరై మాట్లాడారు. తెలంగాణ సాయుధ రైతాంగా పోరాటం. మునగాల జమీందారీ వ్యతిరేక పోరాటం ఆ పోరాటంలో ఉద్భవించిన వ్యక్తి కామ్రేడ్ కాంతరెడ్డి అన్నారు. అలాంటి మహానుభావులు ఆశయ సాధన కోసం మనందరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ వర్ధంతి సభలో పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ జాస్తి సుబ్బారావు, ఎల్ భాస్కరరావు, డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ శ్రీనివాస రెడ్డి, డాక్టర్ చంద్రమోహన్, డాక్టర్ శివప్రసాద్ రెడ్డి, డాక్టర్ అశోక్ కుమార్ , సిపిఎం సీనియర్ నాయకులు మేదరమట్ల వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జిల్లేపల్లి నరసింహారావు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, బెల్లంకొండ సత్యనారాయణ, ఎస్కే సైదా, జుట్టు కొండ బసవయ్య దేవర వెంకటరెడ్డి, అలసగాని బ్రహ్మయ్య రాపోలు సూర్యనారాయణ, ప్రముఖ న్యాయవాదులు వి రంగారావు, ఉయ్యాల నరసయ్య, నలిని, భీమయ్య, ఎస్కె రహిమాన్ , గద్దపాటి కిరణ్, షేక్ కబీర్దాస్, భూపతి బిక్షమయ్య పాల్గొన్నారు.

చిట్యాల ఐలమ్మ జీవిత నాటక ప్రదర్శన

నవతెలంగాణ-హుజూర్‌నగర్



మండల పరిధిలోని గోపాలపురం గ్రామానికి చెందిన చీకూరు లీలావతి వీరనారీ చిట్యాల ఐలమ్మ నాటక ప్రదర్శనను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో హైదరాబాదులో ఎంపిఏ రంగస్థలం కరుణ శాఖ విద్యార్థులచే ఐలమ్మ జీవిత నాటక ప్రదర్శనను నిర్వహించారు. డాక్టర్ నందమూరి తారక రామారావు కళామందిరం నాంపల్లిలో ఈ ప్రదర్శన జరిగింది. ఈ నాటకానికి రంగస్థలం కళల శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజు రచన దర్శకత్వం వహించారు. వీరనారి చిట్యాల ఐలమ్మ జీవిత చరిత్రని విద్యార్థులు అద్భుతంగా తమ పాత్రల్లో నటించి చూపరులను ఆకర్షించారు. కళాకారులు తమ పాత్రల్లో అద్భుతంగా జీవించారు. ఈ నాటకానికి మేకప్ మ్యాన్‌గా మల్లాది గోపాలకృష్ణ, లైటింగ్ రాజు బ్రదర్ సంగీతం, ఆర్ వెంకట్ లక్ష్మణ్ కాష్టం సహకారం, రంగస్థలం కళల శాఖ సింగర్స్ మరియు డప్పు సాయి, మురళి, సాయి కిరణ్, మంజునాథ్, జైపాల్ మహేందర్ వీరి సహకారంతో నాటక ప్రదర్శన అద్భుతంగా జరిగిందని లీలావతి తెలియజేశారు. ఈ ప్రదర్శనకు ఆచార్య కోట్ల హనుమంతరావు రిజిస్టర్ డాక్టర్ బి.ఎం పద్మప్రియ శాఖ అధికారిగా విచ్చేసి కళా ప్రదర్శనను అభినందించారు.

క్రికెట్ బ్యాట్ల పంపిణీ

నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం

ఎస్ఎన్పిఎల్ సీజన్-4లో భాగంగా మండలంలోని పుట్టపాక లయన్స్ టీమ్‌కు అభయ ఆర్గనైజేషన్ సమకూర్చిన బ్యాట్లు, జెర్సీలో గురువారం ఎస్సై జై జగన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అభయ ఆర్గనైజేషన్ అధ్యక్షులు ఆడెపు బిర్జు మాట్లాడుతూ పుట్టపాక లయన్స్ టీమ్‌కు స్పాన్సర్షిప్ అందిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బొడిగె లావణ్య, ఆడెపు అర్చన, దొంతగొని అమరేందర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి ప్రాణాలు కాపాడుకోండి

నవతెలంగాణ-తుంగతుర్తి

రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించేలా రోడ్డు భద్రత మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని తుంగతుర్తి సీఐ శ్రీను నాయక్ అన్నారు.గురువారం రోడ్డు భద్రత మహోత్సవాల నిర్వహణ పై ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి బైక్ పై ప్రయాణించాలన్నారు.ఈ సందర్భంగా మండల కేంద్రంలో ద్విచక్ర వాహనదారులచే మెయిన్ రోడ్ పై ర్యాలీ నిర్వహించారు.దీని ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని నేడు రోడ్డు భద్రతా హెూత్సవం చేపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సై క్రాంతి కుమార్ ఏఎస్ఐ భగవాన్ స్టేషన్ సిబ్బంది యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు సర్వే పెండింగ్ డబ్బులు వెంటనే చెల్లించాలి

నవ తెలంగాణ -క్లాక్ టవర్



ప్రభుత్వం వివిధ సర్వేలు చేయించిన సందర్భంలో ఆశాలకు ఇస్తామన్న డబ్బులు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ మండల కన్వీనర్ భీమగాని గణేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు గురువారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో తిప్పర్తి మండల వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్‌కు వినతి పత్రంఅందజేశారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ గత సంవత్సరం లెప్రసీ పల్స్ పోలియో సర్వేలు ప్రభుత్వ నిర్వహిస్తున్న వివిధ ఎగ్జామ్స్ సెంటర్ల దగ్గర డ్యూటీలకు డబ్బులు ఇస్తామని పనిచేయించుకొని ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. అధికారులు ఒత్తిడి చేసి ఆశలను భయభ్రాంతులకు గురిచేసి సర్వేలు చేయాలని చెప్పడం సరికాదని అన్నారు. అధికారులు ప్రభుత్వానికి పెండింగ్ డబ్బులన్నీ చెల్లించాలని కోరకుండా ఆశాలను బెదిరింపులకు పాల్పడ వద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు టి. పార్వతమ్మ పూలమ్మ ధనమ్మ పుష్ప సువర్ణ రాజేశ్వరి పద్మ విజయ శైలజ యాదమ్మ చంద్రకళ ప్రేమలత సునిత నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి: ఆశా కార్యకర్తలకు కనీస వేతనం 18 వేల రూపాయలు ఇవ్వాలని, సర్వే పెండింగ్ డబ్బులు వెంటనే చెల్లించాలని, ప్రభుత్వం వివిధ సర్వేలు చేయించిన సందర్భంలో ఆశాలకు ఇస్తామన్న డబ్బులు వెంటనే ఇవ్వాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్)మండల అధ్యక్షురాలు రమావత్ కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మండల కమిటీ ఆధ్వర్యంలో మండల వైద్య అధికారి డాక్టర్ ఇస్రాత్ ఉన్నిసాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాంపల్లి చంద్రమౌళి,రమావత్ కవిత మాట్లాడుతూ గత సంవత్సరం లెప్రసీ, పల్స్ పోలియో సర్వేలు ప్రభుత్వ నిర్వహిస్తున్న వివిధ ఎగ్జామ్స్ సెంటర్ల దగ్గర డ్యూటీలకు డబ్బులు ఇస్తామని పనిచేయించుకొని ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ సభ్యురాలు కోరే లలిత, మండల కార్యదర్శి ఎద్దుల సునీత, అనిత, సునీత, రేణుక సైదమ్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

చండూరు : ఆశాలకు సర్వే పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయూచండూరు మండల కన్వీనర్ జెర్రిపోతుల ధనంజయఅన్నారు. గురువారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మండల వైద్యాధికారి డాక్టర్ రాజు కు వినతి పత్రం అందజేశారు.. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ, గత సంవత్సరం లెప్రసీ పల్స్ పోలియో సర్వేలు ప్రభుత్వ నిర్వహిస్తున్న వివిధ ఎగ్జామ్స్ సెంటర్ల దగ్గర డ్యూటీలకు డబ్బులు ఇస్తామని పనిచేయించుకొని ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులుకట్ట పద్మ,జ్యోతి,వరలక్ష్మి, లక్ష్మి, సుజాత, రాజేశ్వరి, జయమ్మ సంతోష, దుర్గ, అనురాధ, లలిత, వెంకటమ్మ వేధావతి, నాగమణి, భాగ్యలక్ష్మి, విజయ, మాధవి, మరియమ్మ, రేణుక, జయలక్ష్మి, సుజాత, సరిత, సఫియా బేగం, రాణి, స్వప్నతదితరులు పాల్గొన్నారు.

ఫీజు వివరాలు నోటీస్ బోర్డులో ఉంచాలి

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం తమ విద్యార్థుల ఫీజు వివరాలను ఉపాధ్యాయుల లిస్ట్‌ను నోటీసు బోర్డులో ఉంచాలని ఎంఈవో లావూరి బాలు అన్నారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రైవేట్, గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యుడీఐఎస్‌ఈ ప్లస్, ఆపార్ ఐడీపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. మండలంలో ప్రైవేట్ పాఠశాలలు మూతబడినట్లయితే వాటి రికార్డ్స్ మొత్తం ఎంఈవో కార్యాలయంలో అందచేయాలని లేకుంటే వారిపై శాఖాపరమైన చర్యలతోపాటు క్రిమినల్ కేసులు పెట్టడం జరుగుతుందన్నారు. హెచ్‌ఎంపీవీ వైరస్ పట్ల అప్రమత్తంగా ఉంటూ విద్యార్థులు పరిశుభ్రంగా ఉండేలా సూచనలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధిగా సీతయ్య

నవతెలంగాణ-కొండమల్లేపల్లి

దేవరకొండ నియోజకవర్గం ఎంఆర్పిఎస్ అధికార ప్రతినిధిగా అందుగుల సీతయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గురువారం వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవరకొండ పట్టణంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ముఖ్య జాతీయ నాయకులు కంబాలపల్లి వెంకటయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎల్లేష్, సహదేవుడు, ఆధ్వర్యంలో తన ఎన్నికను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఎమ్మార్పీఎస్ అభివృద్ధి కోసం తన వంతు సహాయంగా కృషి చేస్తానని తన ఎన్నికకు సహకరించినటువంటి రాష్ట్ర, జిల్లా, మండలాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ కరపత్రాలు విడుదల

నవతెలంగాణ-నాగార్జునసాగర్

నాగార్జునసాగర్ నియోజకవర్గం తిరుమలగిరి సాగర్ మండలం సభావత్ తండాలో గణేష్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 11న ప్రారంభమయ్యే ఎస్‌పిఎల్ 3 జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్, కరపత్రాలను గురువారం నాడు నందికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ముఖ్య సలహాదారుడు, ఆదాసు విక్రమ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభావత్ తండా గ్రామంలో నిర్వహించే జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ కి ప్రతి ఒక్క, యువతి యువకులు, పాల్గొని విజయవంతం చేయాలని కోరినారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ సైదాచారి , మైలపల్లి రమణ, గోపాల ఆదాము, సాయి, యశ్వంతు, గణేషు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షునిగా రమేష్

నవతెలంగాణ-త్రిపురారం

బీజేపీ మండల అధ్యక్షునిగా రెమడాల రమేష్ ఎన్నుకున్నట్లు పార్టీ నాయకులు గురువారం ప్రకటన లో తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన నాగర్జున సాగర్ నియోజక వర్గం బీజేపీ ఇన్‌చార్జి కంకణాల నివేదిత కు, మండల నాయకులు హరీష్, మహేష్, కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో అందరిని కలుపుకుని పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

మండల అభివృద్ధికి కృషి

నవతెలంగాణ-వేములపల్లి



మండలంలోని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి మండల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టల కురుపయ్య, జిల్లా ఉపాధ్యక్షులు రావు ఎల్లారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తిమ్మారెడ్డిగూడెంలో ఐదు లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీలు విద్యుత్తు, మంచినీరు వంటి మౌలిక వసతులను కల్పించుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, వెంకటయ్య, రమేష్, వెంకటేశ్వర్లు, సత్తిరెడ్డి, కోటి, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు పట్టుదల తోడైతే... విజయాన్ని ఎవరు ఆపలేరు

నవతెలంగాణ-చండూరు

లక్ష్యసాధనకు పట్టుదల తోడైతే, విజయాన్ని ఎవరు ఆపలేరని గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలం లోని బంగారుగడ్డ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కోడి శ్రీనివాసులు, అరుణ దంపతులు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులందరూ ఈ మెటీరియల్ ను ఉపయోగించుకొని క్రమశిక్షణ, పట్టుదలతో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను మంచిగా చదివి, మార్చిలో జరగబోయే పరీక్షలను రాసి మంచి మార్కులు సాధించాలన్నారు.ప్రధానోపాధ్యాయులు సి. హెచ్. రామలింగయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులు చదువుకుంటారని, ఇటువంటి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ం ఉచితంగా అందించడం గర్వించదగిన విషయమని గాంధీజీ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నరసింహాచారి, టి. వెంకటేశ్వర్లు, బాబమ్మ, తులసి, యశోద, శోభారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రయివేట్ ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-కోదాడటౌన్

సావిత్రిబాయి ఫూలే 194వ జయంతి సందర్భంగా ఉపాధ్యాయుల గౌరవ సన్మానం ప్రయివేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జె. నరసింహ రావు కోదాడ పట్టణంలోని గ్లోబల్ కాన్సిట్యూట్ స్కూల్ తేజ విద్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రయివేటు పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు జై నరసింహారావు గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, "సావిత్రిబాయి పూలే చూపిన మార్గాన్ని నేటి ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలి. ప్రైవేట్ రంగంలో సేవలందిస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి హెల్త్ కార్డులు, ఐడీ కార్డులు మరియు ఇతర సంక్షేమ పథకాల్లో రిజర్వేషన్ కల్పించాల్సిన అవసరం ఉంది" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి, తేజ విద్యాలయం ఏవో నాగమణి, శ్వేత, శ్యామల, శ్రీ దుర్గ మహేశ్వరి పాల్గొన్నారు.

సాంస్కృతిక సంబురాలను జయప్రదం చేయండి

ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల వెంకన్న

నవతెలంగాణ-సూర్యాపేట



ఈనెల 23,24 తేదీలలో సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే ప్రజానాట్య మండలి ప్రజా సాంస్కృతిక సంబరాలను జయప్రదం చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల వెంకన్న పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ(ఎం) 4వ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఈనెల 23, 24 తేదీలలో సంగారెడ్డిలో జరిగే ప్రజా సంస్కృతిక సంబురాల సందర్భంగా ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో కళారూపాలు ప్రదర్శించడం జరుగుతుందన్నారు. కళాకారులకు గుర్తింపు కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రదర్శన కోసం వెళుతున్న కళాకారునికి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. 50 ఏండ్లు పైబడ్డ కళాకారులకు నెలకు రూ.5000 పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇందిరమ్మ ఇండ్లలో కళాకారులకు అవకాశం కల్పించాలని కోరారు. జిల్లా కేంద్రంలో మినీ రవీంద్రభారతి ఆడిటోరియం నిర్మించాలని డిమాండ్ చేశారు. దీనికోసం రాబోయే కాలంలో పోరాటాలకు ప్రజానాట్య మండలి కళాకారులు, జానపద కళాకారులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు బచ్చలకూరి రాంబాబు, ఉపాధ్యక్షులు మామిడి నాగ సైదులు, పఠాన్ మహబూబలి, సహాయ కార్యదర్శి నందిపాటి సతీష్, జిల్లా కమిటీ సభ్యులు దున్న భిమన్యు, జనంపల్లి సాయి కుమార్, కందుకూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఘనంగా నోముల నరసింహ జయంతి

నవతెలంగాణ-నాగార్జునసాగర్

నందికొండ మున్సిపాలిటీ నాగార్జునసాగర్‌లో గురువారం నాడు మాజీ శాసనసభ్యులు నోముల నరసింహయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు నోముల నరసింహయ్య 69వ జయంతి సందర్భంగా హిల్ కాలనీ లోని నెహ్రు పార్క్‌లో ఆయన విగ్రహానికి పూలమాలవేసి తనయుడు మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్ పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం లోని వివిధ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఉద్యమకారులు, కార్యాకర్తలు, నోముల అభిమానులు పాల్గొన్నారు.

నకిరేకల్ : సీపీఐ(ఎం) శాసనసభ పక్ష నేత నోముల నరసింహయ్య 69వ జయంతిని పురస్కరించుకొని గురువారం స్థానిక మెయిన్ సెంటర్ లో ఆకుల సోమన్న మిత్రమండలి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి మాద యాదగిరి, ఆకుల సోమన్న మిత్రమండలి నాయకులు గాదగోని కొండయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు మాచర్ల సైదులు మాట్లాడుతూ పేదలు, బడుగు, బలహీన, దళిత, మైనారిటీ అభున్నతికై జీవితాంతం పరితపించి పోరాడిన గొప్పనాయకుడు నోముల నర్సింహయ్య అని కొనియాడారు. ఈకార్యక్రమంలో నాయకులు బొజ్జ సుందర్, వంటెపాక వెంకటేశ్వర్లు, పాటి యాదగిరి రెడ్డి, ఉగ్గిడి శ్రీను, వంటెపాక అంబేద్కర్, శేఖర్ రెడ్డి, సైదులు, కృష్ణ, సుధాకర్, లింగయ్య, విజయ్, వి. జమదగ్ని, వి. సోమేష్, జి. యాదగిరి యాదవ్ పాల్గొన్నారు

ఆర్థిక సాయం అందజేసిన ఆశా కార్యకర్తలు

నవతెలంగాణ-నాంపల్లి

మండలంలోని చిట్టెంపహాడ్ గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త బూసిపాక సరిత గత పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. గురువారం ఆమె దశదినకర్మ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల ఆశా కార్యకర్తలు సరిత కుటుంబ సభ్యులను కలిసి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అదేవిధంగా ఆసుపత్రి వైద్యులు, ఆశ కార్యకర్తలు అంతా కలిసి రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మండల అధ్యక్షురాలు రామవత్ కవిత, సెకండ్ ఏఎన్ఎంల మండల నాయకురాలు గాదెపాక పుష్ప, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యురాలు కోరే లలిత, సునీత, భాగ్యమ్మ, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏకాదశిని ప్రశాంతంగా జరుపుకోవాలి: ఎస్సై

నవతెలంగాణ-మునగాల

మండల ప్రజలు నేడు వైకుంఠ ఏకాదశి వేడుకలను భక్తి శ్రద్ధలతో ప్రశాం తం గా నిర్వహించుకోవాలని మునగాల ఎస్ఐ బి. ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని బరఖాత్‌గూడెంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి ఏకాదశి ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. అన్ని వసతులు కల్పించి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆలయ కమిటీకి సూచించారు. ఎస్ఐ వెంట ఏఎస్ఐ కల్లు శ్రీనివాసరెడ్డి,ఆల య చైర్మెన్ పాలిశెట్టి శ్రీనివాస్, ప్రధాన అర్చకులు శ్రీనివాసా చార్యులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలి

నవతెలంగాణ-పెద్దవూర

మధ్యాహ్న భోజన ఏజన్సీ వారు విద్యార్థులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలని మండల విద్యాధికారి తరి రాము ఆదేశించారు. గురువారం మండలం లోని వెల్మ గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రైమరీ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నూనె, చింతపండు, ఉప్పు వంటగది పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు పరిశుభ్రత మైన వాతావరణం లో భోజనం అందించాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా స్వచ్ఛమైన నీటిని అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఉపాధ్యాయులు పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీలు విద్యార్థులకు వండి పెట్టే అన్నం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఏజన్సీ వారు వంట చేసేటప్పుడు తలకు కవర్లు ధరించాలని, అదేవిదంగా చేతులు ఏప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చీదెళ్ల శ్రీనివాస్, సీనియర్ ఉపాధ్యాయులు, వసంత కుమార్, హిమవంతరెడ్డి, గుంటుక రామాంజిరెడ్డీ, వ్యాయమ పాధ్యాయులు లేనినిబాబు, అమ్మ ఆదర్శపాఠశాల చైర్మెన్ లక్ష్మి సురేందర్, పాల్గొన్నారు.

ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-నకిరేకల్

మండలంలోని ఓగోడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త చిట్టి పాక కృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయాడు. గురువారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ కృష్ణను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట నకిరేకల్ మార్కెట్ వైస్ చైర్మన్ దూలం సోములు, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు రంగు వీరయ్య వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ రెడ్డి, బుర్రి వెంకటయ్య, చిట్టిపాక విజేందర్, వెంకటయ్య, పరశు రాములు, కమలాకర్, ప్రకాష్ ఉన్నారు.

వెంకయ్య మృతి బాధాకరం

నవతెలంగాణ-కోదాడరూరల్

బెల్లంకొండ వెంకయ్య మృతి బాధాకరమని మాజీ ఎంపీపీ చింతా కవిత రాదారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని రామలక్ష్మీపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బెల్లంకొండ బ్రహ్మం తండ్రి బెల్లంకొండ వెంకయ్య అనారోగ్యంతో అకాల మరణం చెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ చింతా కవితా రాదారెడ్డి వెళ్లి వెంకయ్య పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శెట్టి సురేష్ నాయుడు, గ్రామశాఖ అధ్యక్షులు అన్నెం అంజిరెడ్డి, ఎర్రవరం పీఏసీఎస్ వైస్ చైర్మెన్ కొప్పుల సుభాష్ రెడ్డి, మాజీ సర్పంచ్ గంగిరెడ్డి కన్నారెడ్డి, తొగర్రాయి గౌడ్ సంఘ అధ్యక్షులు బాలే బోయిన చిన్న యాలాద్రి, కాసాని పుల్లయ్య, రామేశ్వరం, మాజీ ఉపసర్పంచ్ వెంకటరెడ్డి, మండల బీసీ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, కొప్పుల సురేందర్ రెడ్డి ఉన్నారు.

ముత్తిరెడ్డిగూడెం విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-మోటకొండూరు

గత మూడు రోజులుగా విద్యార్థులకు ఆలేరు లోని జడ్పీ హెచ్ ఎస్ స్కూల్లో ఆరుట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజక వర్గ స్థాయి క్రీడలను నిర్వహించారు. ఈ క్రీడలలో దాదాపు 32 గ్రామాల నుండి విద్యార్థులు వివిధ క్రీడల్లో పాల్గొనగా మండల కేంద్రములోని ముత్తిరెడ్డి గూడెం జడ్పీ హెచ్ ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. బాలురకు వాలీబాల్ మొదటి బహుమతి కబడ్డీలో రెండవ బహుమతి సాధించగా బాలికలు వాలీబాల్ మూడవ బహుమతి సాధించారు. వివిధ క్రీడల్లో గెలుపొందిన వారికి స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో పాటు ఫౌండేషన్ చైర్మెన్ ఆరుట్ల సుశీలదేవి పలువురు నేతలు విద్యార్థులను ప్రశంసించి బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండి గఫార్ సిబ్బంది విద్యార్థులు చాటిన ప్రతిభను చూసి వారిని అభినందించారు.



టాలెంట్ టెస్టులు నిర్వహించడం అభినందనీయం

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభాపాటవాలను వెలికి తీసి ప్రోత్సహించేందుకు లకృతినాయక్ మెమోరియల్, సమగ్ర భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టులు నిర్వహించడం అభినందనీయమని ఎంఈవోలు బాలు, బాలాజీనాయక్, లక్ష్మణ్‌నాయక్, రవిలు అన్నారు. గురువారం మిర్యాలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లకృతినాయక్ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించే టాలెంట్ టెస్టుల గోడ పత్రికను వారు విడుదల చేసి మాట్లాడారు. సుదీర్ఘకాలం సామాజిక స్పృహతో ఉపాధ్యాయ వృత్తిలో పనిచేసిన లకృతినాయక్ లేని లోటు తీర్చలేనిదన్నారు. లకృతినాయక్ స్మారకార్థంగా కుటుంబసభ్యులు విద్యార్థుల్లో ఉన్న ప్రతిభాపాటవాలను వెలికితీసేందుకు టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధర్మానాయక్, టీజీయుఎస్ జిల్లా అధ్యక్షుడు కొర్ర కృష్ణకాంత్‌నాయక్, ఫౌండేషన్ కన్వీనర్ పానుగోతు గోపినాద్, సమగ్ర భారత్ ట్రస్ట్ కన్వీనర్ అజయ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతికి దారులు వేసే శాంతి కోసం పోరాడాలి

నవతెలంగాణ-సూర్యాపేట

ప్రగతికి దారులు వేసి శాంతి కోసం పోరాడాలని అంతర్జాతీయంగా యుద్ధ వాతావరణం ఒకవైపు కొనసాగిస్తుంటే మరోవైపు సామ్రాజవాద దోపిడి శక్తులు యుద్ధాలను వ్యాపారంగా చేసుకుంటూ ప్రపంచాన్ని ప్రపంచ శాంతియుత సహజీవన విధానానికి దూరం చేస్తున్నారని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం తెలంగాణ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కే వి ఎల్ అన్నారు. గురువారం స్థానిక ధర్మ బిక్షం భవనంలో జిల్లా అధ్యక్షుడు తొగటి మురళి అధ్యక్షతన జరిగిన అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలస్తీనా పై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం రష్యా ఉక్రేన్ మధ్య జరుగుతున్న యుద్ధం వలన ప్రపంచానికి నష్టమే గాని ప్రగతికి దారులు వేసే చర్యలు కావని మేధావులు, అభ్యుదయవాదులు శాంతికాముకులు ప్రగతిశీరులంతా ఐక్యంగా యుద్ధాలకు వ్యతిరేకంగా గళం విప్పాలని ప్రపంచశాంతి సాధన కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా నాయకురాలు అనంతుల మల్లేశ్వరి, రంగారెడ్డి జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి పోల గాని రవి, జిల్లా కార్యదర్శి గుగులోతు రాజారాం, బూర వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు చామల అశోక్ కుమార్, నిమ్మల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-చండూరు

చండూరు మండలం ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన కొత్త ఆంజనేయులు గౌడ్ ప్రధాన కార్యదర్శి వర్కాల కిరణ్ కుమార్ ,కోశాధికారి తుమ్మల ఆంజనేయులు కుటుంబ భరోసా ఇంచార్జ్ నల్ల స్వామి గౌడ్‌లను గురువారం స్థానిక భారత్ చంద్ర గార్డెన్ లో జిల్లా అధ్యక్షుడు పసుపులేటి కృష్ణ, ప్రధాన కార్యదర్శి పుట్ట మోహన్ రెడ్డి ప్రమాణస్వీకారం చేయించి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ తోకల చంద్రకళ వెంకన్న మాట్లాడుతూ.. ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ శ్రేయస్సు కోసం తమ వంతు తోడ్పాటు ఉంటుందన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ...చండూరు మండలం అసోసియేషన్ ఫొటోగ్రాఫర్ల సంఘ శ్రేయస్ కోసం తోడ్పాటు చేసుకుంటూ ముందంజలో నడపపి,మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ గౌరవ సలహాదారులు పున్న రామకృష్ణ , జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముషం లక్ష్మణ్ నేత ,కుటుంబ భరోసా జిల్లా ఇంచార్జ్ నక్క జానయ్య, వైస్ కోశాధికారి గుమ్మడవెల్లి శ్రీను ,జిల్లా మీడియా చైర్మన్ అవురోజు మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షులు మొగుదాల వెంకటేశం,చండూర్ మండల సీనియర్ ఫొటోగ్రాఫర్లు నాగరాజు, గంగాధర్, అజంతా చారి, యాదయ్య,సతీష్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి

పోచంపల్లి మండల ఫస్ట్ ఎయిడ్ మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్సిపల్ పట్టణ కేంద్రంలోని రమాదేవి ఫంక్షన్ హాల్‌లో వెంకటేశం ఎన్నికల అధికారిగా నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా సీత భాస్కర్ ఉపాధ్యక్షులు కడవేరు వెంకటాద్రి సూరపల్లి బాలరాజు ప్రధాన కార్యదర్శి వేముల రాఘవేందర్ సహాయ కార్యదర్శి చిక్క మంగ వలం దాస్ గోవర్ధన్, కోశాధికారి శంకర్, గౌరవ అధ్యక్షులు రుద్ర ధనంజయ, గౌరవ సలహాదారులు చెలివేరు రాములు, వేముల వెంకటేశం, సభ్యులు ఆడెపు సిద్ధులు, బత్తుల ఉపేందర్, యాదగిరి, నరసింహరావు, కామిని మహేష్ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి జిల్లా కన్వీనర్ కాలువల బాలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పొట్ట బత్తిని విట్టల్, నలపరాజు లింగయ్య, చౌటుప్పల్ డివిజన్ అధ్యక్షులు బొమ్మిడి సత్తిరెడ్డి, భువనగిరి డివిజన్ మెంబర్లు సూర్య పెళ్లి ప్రమోద్, కడవెరి కృష్ణయ్య పాల్గొన్నారు.

చిన్న కొండూరు-సంగెం రోడ్డును పూర్తి చేయాలి

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్



చిన్న కొండూరు-సంగెం రోడ్డును పూర్తి చేయాలని సీపీఐ(ఎం) చిన్న కొండూరు గ్రామశాఖ కార్యదర్శి మండల కార్యవర్గ సభ్యులు కోరారు. గురువారం వారు మాట్లాడుతూ చౌటుప్పల్ నుండి సంఘం వరకు డబ్బులు రోడ్డు పనులు ప్రారంభించి సంవత్సరాలు గడుస్తున్న నేటి కూడా పనులు పూర్తి చేయడం లేదని రాత్రి పగలు వాహన దారులు అనేక ఇబ్బందులు పడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా తవ్వి కంకర పోసి వదిలేశారు.రోడ్డు దిగి మళ్లీ రోడ్డు పైకి బైకులు గాని వాహనాలు స్కిడ్ అయి ప్రమాదాలు జరిగి అవిటి వాళ్ళు అవుతున్నారు.ఎప్పుడు పది పదిహేను రోజులు పని స్టార్ట్ చేసి వదిలేసి వెళుతున్నారు ఇప్పటివరకు ఎంతోమంది ప్రమాదాలకు గురై చాలా ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వము పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్టుగా ఉండి ప్రజలకు ఇబ్బంది పెడుతున్నారు వెంటనే రోడ్డు పనులు పూర్తి చేసి ప్రజలను కాపాడవలసిందిగా ప్రభుత్వాన్ని చింతల సుదర్శన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గ్రామాల్లోని వీధులను పరిశుభ్రంగా ఉంచాలి

నవతెలంగాణ-చివ్వెంల

గ్రామాల్లో వీధులను పరిశుభ్రతగా ఉంచాలని స్వచ్ఛ భారత్ రాష్ట్ర బృందం సభ్యులు జయరాం, సెల్వరాజు, నజీమ్ అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా మండలంలోని తిరుమలగిరి గ్రామ పంచాయతీని రాష్ట్ర బృంద సభ్యులు అధికారులతో కలిసి సందర్శించారు. గ్రామ పంచాయతీలో ఘన, ద్రవ్య వ్యర్థాల నిర్వహణ ఎలా ఉందో గ్రామస్తులను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. గృహస్థాయిలో తడి, పొడి చెత్త వేరు చేయడం జరుగుతుందా లేదా అని ఆరా తీశారు. అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు. మరుగుదొడ్ల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం డంపింగ్ యార్డ్‌ని సందర్శించి తడి, పొడి చెత్త వేరు చేయడం, చెత్త నుండి సంపద సృష్టించడం గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చక్రాల సంతోష్ కుమార్, ఎంపీ ఓ ఆడెపు దయాకర్, ఏపీఓ నాగయ్య, ఎస్బిఎం కన్సల్టెంట్స్ హరి, నరేందర్, పంచాయతీ కార్యదర్శులు కవిత, శ్రావణి, అశోక్, బాబు, టెక్నికల్ అసిస్టెంట్ దుర్గ భవాని, ఫీల్డ్ అసిస్టెంట్ జలంధర్ రెడ్డి, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

తెలంగాణ-రాజాపేట

మండలంలోని కాల్వపల్లి గ్రామంలో పేంట రామస్వామి అనారోగ్యంతో మరణించగా ఇంజ నర్సయ్య ఫౌండేషన్ చైర్మెన్ ఇంజ నరేష్ గురువారం కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థిక సహాయాన్ని కుమారులైన పెంట భాస్కర్ కాంగ్రెస్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు పెంట రాజు కి అందజేశారు. ఈ కార్యక్రమంలో కళ్లెం పాండు, పేంట ఆంజనేయులు, గాంధాల సిద్ధులు, పెంట దామోదర్, పెంట ప్రవీణ్, పేంట సిద్దులు,కుందన రాజయ్య, పెంట సత్యనారాయణ, పేంట శ్రీను, చక్రాల బాబు, పెంట ఫౌండరీకం, పెంట ప్రవీణ్, పెంట ఉపేందర్, కళ్లెం సత్యనారాయణ, చేర్యాల నాగయ్య, చేర్యాల నరేష్, ఇంజ దాస్, చేర్యాల నాగరాజు, కాకల్ల సుధాకర్, రఘు, కాంగ్రెస్ పార్టీ కాల్వపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు కాకల్ల శ్రీకాంత్, కాల్వపల్లి పద్మశాలి సంఘం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గణిత ప్రతిభ పోటీలలో మోడల్ స్కూల్ ఘనత

నవతెలంగాణ-తిరుమలగిరి



జాతీయ గణిత దినోత్స వంను పురస్కరించుకుని గణిత శాస్త్ర పితామహులు శ్రీనివాస రామానుజన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిరుమలగిరిలో నిర్వహించిన మండల స్థాయి గణిత ప్రతిభ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు జూనియర్ విభాగంలో మొదటి బహుమతి, సీనియర్ విభాగంలో ద్వితీయ బహుమతి అదేవిధంగా క్విజ్ పోటీలలో ప్రథమ బహుమతిని గెలుచుకొని మోడల్ స్కూల్ సత్తా చాటారు. బహుమతులు గెలుచుకున్న వారిలో బి.మనస్విని(6వ), ఎస్.రుత్విక్ (7వ), కే.సాయి ప్రణీత్ (8వ), డి.ఉదయ్ కుమార్ (9వ), సిహెచ్.సౌమ్య బాయ్ (10వ) లు పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు.వీరికి ప్రిన్సిపల్ సంజీవ్ కుమార్ తో పాటు గణిత అధ్యాపకులు క్రాంతి కిరణ్ మరియు సురేష్, జగన్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ప్రిన్సిపల్ సంజీవ్ కుమార్ విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ భవిష్యత్తులో ఎన్నో అవార్డులు అందుకోవాలని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

పండుగకు ఊరు వెళ్తే జాగ్రత్తలు పాటించాలి: ఎస్ఐ

నవతెలంగాణ-మునగాల

సంక్రాంతి పండుగకు ఊరు వెళ్ళే వారు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు పాటించాలని మునగాల ఎస్ఐ బి.ప్రవీణ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మీరు వూరికి వేళ్ళే సమయంలో మీ అడ్రస్ ఫోన్ నెంబర్‌ను పోలీసు స్టేషన్‌లో ఇవ్వాలని సూచించారు. ఇంటి తాళాలు పూల కుండీలు, షుషాక్స్, డోర్ మ్యాట్స్ కింద పెట్ట రాదని గుర్తుచేశారు. ఇంటి తాళాలు విలువైన వస్తువులు మీ వెంటే తీసుకు పోవటం మంచిదన్నారు. వాహనాలను రోడ్డు బయట కాకుండా ఇంటి ఆవరణలో పార్కింగ్ చేయాలన్నారు. వాహనాల డిక్కిలో విలువైన వస్తువులు పెట్ట రాదని చెప్పారు. ఇంటి డోర్‌కు సెంట్రల్ లాక్ సిస్టంను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వుండాలని తెలిపారు. డివిఆర్ కనబడకుండా ఇంటి లోపల రహస్య ప్రదేశాల్లో పెట్టాలని చెప్పారు. వూరికి వెళ్ళుతున్న విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయరాదని సూచించారు. కొత్త వ్యక్తుల కదలికలపై 100 డయల్ చేయాలన్నారు.

కాంగ్రెస్ హామీలను అమలుచేయాలి

నవతెలంగాణ-రాజాపేట

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన అన్ని హామీలను అమలుచేయాలని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ దామోదర్‌కు వినతిపత్రం అందజేశారు. రైతులకు రెండు లక్షల రుణ మాఫీ వెంటనే అమలు చేయాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు రైతు భరోసా ఎకరానికి 15000 రూపాయలు వెంటనే విడుదల చేయాలని, కౌలు రైతులకు ఎకరానికి 12 వేల రూపాయలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాజాపేట మండల తాసిల్దార్ దామోదర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజాపేట కిసాన్ మోర్చా మండల ఉపాధ్యక్షులు జెన్న సిద్ధులు, రాజాపేట బిజెపి గ్రామ శాఖ అధ్యక్షులు సాధనబోయిన శంకర్, సీనియర్ నాయకులు దాచేపల్లి శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు సోమసాని చంద్రం చిగుళ్ల బీరయ్య, మార్గశివ, కాసోజు సంపత్ శ్రీహరి, గవ్వల సిద్దేశ్వర్, రమేష్, అంకతి శ్రీను, నరేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి

కాంగ్రెస్ మున్సిపల్ పట్టణ కమిటీ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా భారత లవకుమార్, ఉపాధ్యక్షులుగా వనం వెంకటేశం, వంగూరి పాండు, మునుకుంట్ల చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా గుడిగంటి వెంకటేశం, సహాయ కార్యదర్శి కడవేరు హనుమంతు, తడక వెంకటేశం, తంగళ్ళ మల్లేశు, ఎజాస్ పాండు, నరేష్, యాదగిరి, గోవర్ధన్ రెడ్డి, కార్యదర్శి కుక్క కుమార్, బిజిలి కుమార్, పెండెం కైలాసం, ఏనుగు మల్లారెడ్డి, సామల రాజిరెడ్డి, ముప్పిడి శ్రీనివాస్, కీర్తి సంజీవ, రుద్ర సూర్యప్రకాష్, తాటి నరసింహ, కొండమడుగు భీమయ్య, కోశాధికారి మోటి రాజు, కార్యవర్గ సభ్యులు ఐటిపాముల ధర్మేందర్, తాటి ప్రభాకర్, ప్రసాద్ కూరపాటి, వెంకటేశం, ముషం శ్రీనివాస్, అశోక్, కప్పల జంగయ్య, బొడుగు యాదగిరి, కొమ్ము సందీప్, నరేష్ ఎన్నుకున్నారు.

వినియోగదారుల సంక్షేమమే లక్ష్యం

నవతెలంగాణ-గరిడేపల్లి

వినియోగదారుల సంక్షేమమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నట్లు మైలార్ శెట్టి సైదమ్మ ఫిల్లింగ్ స్టేషన్ అధినేత రాజీవ్ అన్నారు. మండల పరిధిలోని గడ్డిపల్లి కీతవారి గూడెంలో వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వారు రైతులకు వాహనదారులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహన వినియోగదారులకు నాణ్యమైన సేవల ందిస్తున్నట్లు తెలిపారు.

సంక్రాంతి సంబరాలు

నవతెలంగాణ-మిర్యాలగూడ

మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో గురువారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. చిన్నారులు రంగులతో కూడిన ముగ్గులు వేయడంతోపాటు భోగి మంటలు వేసి హరిదాసు కీర్తనలు విచిత్ర వేషధారణలతో సంక్రాంతి సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యుడు చెన్నూరు రవికుమార్ మాట్లాడుతూ, తెలుగు వారి ముఖ్య పండుగలో సంక్రాంతి పర్వదినం ప్రత్యేకమైనదని, మన సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేసే గొప్ప పండుగని తెలిపారు. గ్రామీణ వాతావరణంలో అత్యంత అందంగా కోలాహాలతో జరుపుకునే సంక్రాంతి పర్వదిన విశిష్టతను విద్యార్థులకు తెలియజేయడం ద్వారా వారిలో చిన్నతనం నుండే సామాజిక స్పృహ అలవరుతోందని తెలిపారు. అనంతరం ముగ్గులు వేసిన విద్యార్థులకు ప్రథమ బహుమతి ఐదవ తరగతి చదువుతున్న రిషికకు, ద్వితీయ బహుమతి మూడవ తరగతి చదువుతున్న ఇందుకు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పిట్టల రాములు, నాగమణి, స్వాతి, మానస, రేణుక, జయశ్రీ, భవాని తదితరులు ఉన్నారు.